నేటి కందం- నేటికి అందం

ఘనుడు తెలంగాణకు చెం
దిన వైద్యుడు ప్రభు కుమారు దీక్షను గొని చే
సిన సేవకు జెస్సీ జా
క్సనవార్డును బొందె వర చికాగో పురిలోన్ !!

(తెలంగాణా కు చెందిన వైద్యుడు చల్లగాలి ప్రభు కుమార్ చేసిన సామాజిక సేవలకు గుర్తింపుగా చికాగో నగరంలో జెస్సీ జాక్సన్ అవార్డు ఆయనకు అందజేశారు. ఇది తెలంగాణా రాష్ట్రానికే గర్వకారణం.)

-రాధశ్రీ

సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

ఎప్పటికి ప్రభుత్వం
ఎన్నుకునే ప్రలోభం
ఓట్ల రాజకీయానికి
ఒనగూరే స్వలాభం.
ఏకంగా ప్రకటించును
ఎన్నెన్నా ఉచితాలు
అమలులో కొన్నైనా
ఆగిపోవు ఖచ్చితాలు

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ బుధవారం 15-4-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:192 పేజీలు:6 వెల: రూ.1/-


## ఛత్తీస్‌గఢ్ పవర్‌ప్లాంట్‌లో బాయిలర్ పేలుడు..

## 10 మంది మృతి.. 40 మందికి గాయాలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక పవర్ ప్లాంట్‌లోని బాయిలర్ పేలిన ఘటనలో 10 మంది మరణించగా, 40 మంది గాయపడ్డట్లు తెలుస్తోంది. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్, శక్తి జిల్లా, సింగితారి గ్రామ సమీపంలోని వేదాంత పవర్ ప్లాంట్‌లో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. పవర్ ప్లాంట్‌లోని బాయిలర్ ఉన్నట్లుండి పేలిపోయింది.

ఘటన జరిగినప్పుడు చాలా మంది కార్మికులు పరిశ్రమ లోపల పని చేస్తున్నారు. ఈ పేలుడు భారీగా ఉండటంతో అక్కడ పని చేస్తున్న కార్మికుల్లో 10 మంది మరణించారు. మరో 30 నుంచి 40 మంది వరకు గాయపడ్డారు. ఈ ఘటనతో అక్కడ తొక్కిసలాట లాంటి పరిస్థితి తలెత్తింది. పేలుడు జరగడంతో అక్కడి కార్మికులు పారిపోయేందుకు ప్రయత్నించగా, ఇంకొందరు గాయపడ్డట్లు తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడ్డవారిని స్థానిక ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.వీరిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పేలుడుకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. అయితే, ఈ అంశంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి సమాచారం వెల్లడించలేదు.

## బిహార్ నూతన సీఎంగా సమ్రాట్ చౌధరీ..



న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ ఎంపికయ్యారు. దాదాపు రెండు దశాబ్దాలు పాటు బిహార్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న నితీష్ కుమార్ కాసేపటి క్రితమే రాజీనామా చేశారు. దీంతో బిహార్‌లో అత్యున్నత పదవిని అధిరోహించనున్న తొలి బీజేపీ నేతగా సమ్రాట్ చౌధరీ నిలిచారు. ఇప్పటివరకు బిహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న 57 ఏళ్ల సమ్రాట్ ఓబీసీ వర్గమైన కుష్వాహా కులానికి చెందినవారు. బిహార్‌లోని ఓబీసీ కులాలలో యాదవుల తర్వాత కుష్వాహా వర్గమే అతి పెద్దది

ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగిన నితీష్.. కుష్వాహా కులానికి చెందిన వ్యక్తినే తదుపరి సీఎంగా ప్రకటించాలని షరతు విధించినట్టు సమాచారం. నితీష్ సలహా మేరకే బీజేపీ.. సమ్రాట్‌కు సీఎం పీఠం అప్పగించినట్టు తెలుస్తోంది. మధ్యలో కొన్ని సంవత్సరాలు మినహా 2005 నుంచి బీజేపీ, బిహార్ ప్రభుత్వంలో మైనర్ భాగస్వామిగా ఉంటూ వచ్చింది. 20 సంవత్సరాల తర్వాత బీజేపీకి చెందిన నేత బిహార్ సీఎం అయ్యారు. 243 మంది సభ్యులున్న బిహార్ అసెంబ్లీలో నితీష్ కుమార్ పార్టీకి 85 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 89 మంది ఉన్నారు కాగా, బిహార్ కొత్త సీఎం అయిన సమ్రాట్ చౌధరీ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి . ఆయన మొదట ఆర్జేడీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆ తర్వాత జేడీ (యు)లో చేరారు. ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నాయకుడిగా ఎదిగారు. ఈ రకంగా ఆయనకు బిహార్‌లోని మూడు ప్రధాన పార్టీల్లో పని చేసిన అనుభవం ఉంది. కాగా, ఏప్రిల్ 15వ తేదీన బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## అంబేద్కర్ వల్లే అన్ని వర్గాల ప్రజలకు హక్కులు లభించాయి : మాజీ మంత్రి తలసాని




హైదరాబాద్, ఏప్రిల్ 14:అన్ని వర్గాల ప్రజలకు అన్ని రంగాలలో హక్కును కల్పించిన ఘనత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి దక్కుతుందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని కీస్ స్కూల్‌లో నిర్వహించిన భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటం వద్ద పూలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులే అమలు అవుతున్న రిజర్వేషన్ లు అన్నారు.

కేసీఆర్ ప్రభుత్వం అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అనేక కార్యక్రమాలు అమలు చేసిందని వివరించారు. అద్భుతమైన సచివాలయం నిర్మిస్తే దానికి అంబేడ్కర్ పేరు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. చారిత్రాత్మక నగరం హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ వద్ద అతిపెద్ద 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిది అని చెప్పారు. రాజ్యాంగం లో కల్పించిన వెసులుబాటు తోనే తెలంగాణ రాష్ట్రాన్ని పోరాడి సాధించుకున్నామని అన్నారు.

అంటరానితనం, కులవివక్షను రూపుమాపడం కోసమే రాజ్యాంగం రూపొందించబడిందని, ఇప్పటికీ కొన్ని ప్రాంతాలలో ఆలయ ప్రవేశాలను అడ్డుకుంటున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మోండా డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు జయరాజ్, మహేందర్, టి ఎన్ శ్రీనివాస్, గిరి, భవాని, అరుణ, శారద తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌సభలో సీట్ల పెంపునకు కేంద్రం ప్రతిపాదన.. 543 నుంచి 850కి పెరగనున్న ఎంపీ స్థానాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: పార్లమెంట్‌లో లోక్‌సభ సీట్ల పెంపుపై కేంద్రం తాజా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీని ప్రకారం లోక్‌సభ సీట్లు 543 నుంచి 850కి పెంచాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు తగిన డ్రాఫ్ట్ కాపీని రూపొందించిన కేంద్రం పార్లమెంట్‌లోని పార్టీలకు, ఎంపీలకు అందజేసింది. మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ, నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఏప్రిల్ 16, 17, 18 తేదీల్లో మూడు రోజులపాటు ఈ సమావేశాలు జరుగుతాయి.

కేంద్ర ప్రతిపాదనల ప్రకారం.. లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 543 ఎంపీ సీట్లు 850కి పెరుగుతాయి. ఇందులో రాష్ట్రాల్లో 815 స్థానాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 35 వరకు స్థానాలు పెరిగే అవకాశం ఉంది. ఇదే సమయంలో చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును కూడా పార్లమెంట్‌లో ప్రవేశపెడతారు. ప్రస్తుతం నారి శక్తి వందన్ అభినియం పేరుతో ఈ బిల్లును ప్రవేశపెట్టబోతుంది కేంద్రం. 2011 జనాభా లెక్కలకు అనుగుణంగా ప్రస్తుతానికి మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తారు. దీని ప్రకారం మహిళలకు పార్లమెంట్‌లో 273 సీట్లు వచ్చే అవకాశం ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లును, నియోజకవర్గాల పునర్విభజన బిల్లును త్వరలోనే పార్లమెంట్‌లో ఆమోదింపజేయాలని కేంద్రం లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఈ రెండింటిని 2029 లోక్‌సభ ఎన్నికల్లో అమలు చేయాలని కేంద్రం భావిస్తోంది.

నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం ఒక కమిటీని నిర్ణయిస్తుంది. ఈ కమిటీయే మహిళలకు సీట్లు కేటాయిస్తుంది. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలైతే పార్లమెంట్‌తోపాటు రాష్ట్రాల అసెంబ్లీల్లోనూ మహిళలకు సీట్లు పెరుగుతాయి. ఈ బిల్లులు అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ అవసరం. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 55, ఆర్టికల్ 81లను సవరించాలి. ఇది 131వ రాజ్యాంగ సవరణ అవుతుంది.

## ఇందిరమ్మ ఇళ్లపై ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయి: భట్టి విక్రమార్క

ఖమ్మం, ఏప్రిల్ 14: దేశంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజకీయ పార్టీ కాంగ్రెస్‌లో మనమంతా పని చేయటం అదృష్టమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఈ దేశానికి కాంగ్రెస్ స్వాతంత్ర్యం తెచ్చిందని ఉద్ఘాటించారు. దేశంలో ఏ పార్టీకి ఇంతటి ఘన చరిత్ర లేదని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నూతన కమిటీ బాధ్యతల స్వీకార కార్యక్రమం ఈరోజు (మంగళవారం) జరిగింది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్ హాజరయ్యారు. అలాగే, అంబేడ్కర్ 135వ జయంతి సందర్భంగా ఖమ్మం నగరంలోని జడ్పీ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి భట్టి విక్రమార్క, మహేశ్ కుమార్ గౌడ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు.



**ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయి..**

నేడు దేశాన్ని ఏలుతున్న బీజేపీ కూడా కాంగ్రెస్ తర్వాతే వచ్చిందని భట్టి విక్రమార్క ప్రస్తావించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తోంటే రైతులకు ఆ మేలు జరగకూడదని ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. రూ.22,500 కోట్లతో రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణం చేపట్టామని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆగ్రహించారు. పేదలకు ఇళ్లు దక్కకూడదనే లక్ష్యంతో ప్రతిపక్షాల నేతలు దుర్మార్గమైన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేద్దాం..**

కాంగ్రెస్ బలోపేతానికి అందరం ఐక్యంగా కృషిచేద్దామని భట్టి విక్రమార్క సూచించారు. మహిళలకు రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని వెల్లడించారు. కాంగ్రెస్‌పై ప్రతిపక్షాల నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొటాలని పిలుపునిచ్చారు. గత పదేళ్లు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీని కాపాడుకునేందుకు ప్రాణాలు ఫణంగా పెట్టి పోరాడారని ప్రశంసించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేద్దామని సూచించారు. పార్టీకోసం కష్టపడిన వాళ్లకి తప్పకుండా గుర్తింపు దక్కుతుందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## ఎండల్లో బయటకు రావొద్దు.. ప్రజలకు మంత్రి సీతక్క సూచనలు

హైదరాబాద్, ఏప్రిల్ 14: ఎండల్లో బయటకు రావొద్దని ప్రజలకు తెలంగాణ మంత్రి సీతక్క సూచించారు. రాష్ట్రంలో తీవ్ర ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశం చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయటకు రావొద్దని పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల మధ్య పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. బయటకు వస్తే టోపీ, తలపాగా తప్పనిసరిగా ధరి

ఎండదెబ్బ ప్రమాదమని.. ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని మంత్రి సీతక్క తెలిపారు. అధికారులు గ్రామాలు, పట్టణాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ స్థాయిలో తాగునీటి సౌకర్యాలను కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే, ఉపాధి హామీ కార్మికులకు ప్రత్యేక సూచనలు చేశారు. పనిస్థలాల్లో తాగునీటి వసతి ఏర్పాటు తప్పనిసరని తెలిపారు. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో పని చేసే ప్రాంతాల్లో ఆయా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కార్మికుల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## మహిళా రిజర్వేషన్‌తో కొత్త యుగం ప్రారంభం: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:భారత నారీ శక్తికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ లేఖ రాశారు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ల కలను సాకారం చేశామని ప్రకటించారు. శాసనసభలు, పార్లమెంటులో మహిళల భాగస్వామ్యం దేశ భవిష్యత్తును మారుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నారీ శక్తి వందన్ అధినియం బిల్లు కేవలం చట్టం మాత్రమే కాదని, దేశ నిర్మాణంలో మహిళలకు లభించిన గౌరవమని వెల్లడించారు. మహిళల అభివృద్ధి నుంచి 'మహిళల నేతృత్వంలోని అభివృద్ధి' దిశగా భారత్ అడుగులు వేస్తోందని పేర్కొన్నారు.



లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. దేశం 'వికసిత్ భారత్'గా మారడంలో మహిళల పాత్ర కీలకమని అన్నారు. ఈ చారిత్రక మార్పును స్వాగతిస్తున్న భారత నారీ శక్తికి ప్రధాని హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మహిళా బిల్లు చట్టం అమలు చేసేందుకు తమ ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## అజ్ఞాతంలో నలుగురు మావోయిస్టులే ఉన్నారు: పోలీస్ శాఖ

హైదరాబాద్, ఏప్రిల్ 14: తెలంగాణాకి చెందిన నలుగురు మావోయిస్టులు మాత్రమే ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని రాష్ట్ర పోలీస్ శాఖ వెల్లడించింది. కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణ రావు అలియస్ గణపతి, పసునూరి అలియాస్ నరహరి అలియాస్ సంతోష్, స్టేట్ కమిటీ సభ్యులు జడే రత్నాబాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు ఉన్నారని పోలీస్ శాఖ వివరించింది

సాయుధ పోరాటం విరమించి.. జనజీవన స్రవంతిలో కలవాలంటూ ఇప్పటికే మావోయిస్టులకు డీజీపీ పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. తెలంగాణా ప్రభుత్వ లొంగుబాటుతోపాటు పునరావాస విధానం ద్వారా లభించే ప్రయోజనాలు పొందాలను మావోయిస్టులకు పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసిన విషయం విదితమే.

మరోవైపు సోమవారం కాంకేర్ జిల్లాలో భద్రతా బలగాల కూంబింగ్ సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఎల్‌ఓసీ కమాండర్ రూపీ రెడ్డి అలియాస్ రంగబోయిన భాగ్య (46) మరణించారు. సిద్ధిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం ఆమె స్వస్థలం. రెండు దశాబ్దాలుగా ఆమె అజ్ఞాతంలో ఉంటున్నారు.

మూడు రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్‌గా రూపీ రెడ్డి ఉన్నారు. ఆమెపై రూ. 5 లక్షల రివార్డు ఉంది. ఆమె మృతదేహానికి ఇప్పటికే పోస్ట్‌మార్టం పూర్తయింది. మంగళవారం సాయంత్రం ఈ మృతదేహం ఆమె స్వగ్రామానికి చేరుకోనుంది. బుధవారం రూపీ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## భానుడి ప్రతాపం.. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, ఏప్రిల్ 14: తెలంగాణలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఈరోజు(మంగళవారం) రాష్ట్రంలో నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో నిజామాబాద్‌లో అత్యధికంగా 42.4 డిగ్రీలు నమోదు అయ్యింది. ఆదిలాబాద్‌లో 42.3 డిగ్రీలు, మహబూబ్‌నగర్‌లో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో కూడా 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో సాధారణ స్థాయి కంటే 2 నుంచి 3 డిగ్రీలు ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్న పరిస్థితి.

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతూ, మధ్యాహ్నం అత్యధిక స్థాయికి చేరుతోంది. ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకంగా కార్మికులు, వృద్ధులు, చిన్నపిల్లలు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. మరికొన్ని రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావొద్దని ప్రజలకు అధికారులు సూచించారు.

## ఇరాన్‌తో యుద్ధం.. ఇజ్రాయెల్‌తో రక్షణ ఒప్పందం రద్దు చేసుకున్న ఇటలీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: ఇరాన్‌తోపాటు లెబనాన్‌పై యుద్ధం చేస్తున్న ఇజ్రాయెల్‌కు ఇటలీ షాకిచ్చింది. ఇజ్రాయెల్‌తో కుదుర్చుకున్న రక్షణ ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఇటలీ ప్రధాని జార్జియా మెలోని మంగళవారం దీనిపై ప్రకటన చేశారు. "ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకుని ఇజ్రాయెల్‌తో కుదుర్చుకున్న రక్షణ ఒప్పందం పొడిగింపును రద్దు చేసుకుంటూ ఇటలీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది" అని జార్జియా మెలోని ప్రకటించారు.

వెరోనాలో జరిగిన ఒక కార్యక్రమంలో జార్జియా ఈ ప్రకటన చేశారు. ఇజ్రాయెల్-ఇటలీ మధ్య రక్షణకు సంబంధించి సైనిక పరికరాలు, సాంకేతిక సహకారం అందించే విషయంలో ఒప్పందం ఉంది. అయితే, ఈ రక్షణ ఒప్పందం ఇప్పటికిప్పుడు రద్దు కాదు. ఒప్పంద కాల పరిమితి ముగిసిన తర్వాత పొడిగింపు జరగాలి. ఈ పొడిగింపునే ఇటలీ రద్దు చేసుకుంటూ నిర్ణయం తీసుకుంది. ఈ ఒప్పందాన్ని మళ్లీ కొనసాగించాలంటే అప్పటి పరిస్తితుల్ని బట్టి ఇటలీ ప్రభుత్వం సమీక్షించి నిర్ణయం తీసుకుంటుంది. రెండు దేశాల మధ్య 2006లో ఈ ఒప్పందం కుదిరింది. ఇది ప్రతి ఐదేళ్లకోసారి సమీక్షించి పొడిగించుకుంటూ వస్తున్నారు. ఈసారి మాత్రం ఒప్పందాన్ని రద్దు చేసుకోబోతుంది ఇటలీ. ఇరాన్‌తో యుద్ధానికి సంబంధించి ఈ ప్రాంతంలో స్థిరత్వం, శాంతి కోసం అని రకాల సంప్రదింపులు జరపాలని జార్జియా మెలోని కోరుతున్నారు.

హార్ముజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ప్రయత్నించాలని ఆమె సూచించారు. హార్ముజ్ జలసంధి తమకు కూడా చాలా ముఖ్యమని, చమురుతోపాటు ఎరువుల రవాణాకు కూడా ఎంతో కీలకమని మెలోని వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో ఇటీవల అమెరికా జరిపిన చర్చలు విఫలమైన సంగతి తెలిసిందే.

# పౌర సమాజ ఏకీకరణకు దివ్య ఔషధాలు 'కళలు' మాత్రమే

## (15 ఏప్రిల్ "ప్రపంచ కళా దినోత్సవం" సందర్భంగా)

కళ అనేది ఒక విశ్వ భాష. కళ ద్వారా సరిహద్దులు చెరపబడుతున్నాయి. ప్రపంచ ప్రజలు సంస్కృతుల ఫలితంగా ఏకతాటిపైకి వస్తున్నారు. మన భావోద్వేగాలు, ఆలోచనలు, ఉపాయాలు, జీవన విధానాలు, సంప్రదాయాలు వ్యక్తం చేయబడుతున్నాయి. సమాజ చైతన్య వేదికలుగా కళలు అపార ప్రయోజనాలను అందిస్తున్నాయి. కళలకు ఉన్న అపార అదృశ్య శక్తి ప్రజలను ఏకం చేయడానికి, సమాజంలో నెలకొన్న అనారోగ్యకర ఆచారాల చికిత్సకు, సమైక్యంగా సాగిపోవడానికి ఉపయోగపడుతున్నాయని ఇటీవల జరిగిన సంక్షోభాలు, కరోనా విపత్తులు, మానవ వేదనల సమయాలు రుజువు చేస్తున్నాయి. కళా విద్యతో అభిజ్ఞా నైపుణ్యాల్లో వృద్ధి, దృశ్య మాద్యమ జ్ఞానం పెరగడం, ఆత్మ గౌరవంతో పాటు ఆత్మ విశ్వాసం ఊపందుకోవడం జరుగుతున్నది. మానసిక ఆందోళనలు, ఒత్తిడి లాంటి అనారోగ్యాలకు చికిత్సలు, సృజన/ఆవిష్కరణల ప్రవృత్తిని మేలుకొలపడం లాంటి ప్రయోజనాలు కలుగుతున్నాయి.

ప్రపంచ కళా దినోత్సవం-2026 ఇతివృత్తం:

కళాకారుల సృజన ద్వారా పౌర సమాజం జాగృత పడడం, వైవిధ్యభరిత కళా ప్రదర్శనలు కొనసాగడం, మానవ సుస్థిరాభివృద్ధిలో కళలు భాగస్వామ్యం తీసుకోవడం గమనించిన యునెస్కో 2019లో తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 15 ఏప్రిల్‌న "ప్రపంచ కళా దినోత్సవం" లేదా "వరల్డ్ ఆర్ట్ డే" నిర్వహించడం జరుగుతోంది. 2026 ప్రపంచ కళా దినోత్సవ ఇతివృత్తంగా "భావ వ్యక్తీకరణ తోట : కళల ద్వారా సమాజాభివృద్ధి" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. కళా సృజనతో ప్రపంచ మానవాళి ఒకే వేదికపైకి రావడం, విజ్ఞాన వితరణ జరగడం, ఉత్సుకత పెరగడం, విభేదాల పరిష్కారాల దిశగా చర్చలు కోనసాగడం జరుగుతున్నది. కళా ప్రదర్శనలను పోత్సహించడం, కళాకారులకు స్వేచ్ఛను ఇస్తూ అక్కున చేర్చుకోవడం కొనసాగాలి. కళా వేదికల వెలుగుల ద్వారా పౌర సమాజ అభివృద్ధి సుసాధ్యం అవుతున్నదని తెలుసుకోవాలి.

ఆర్కిటెక్చర్, సంగీతం, పేయింటింగ్, శిల్పాలు చెక్కడం, నాట్యం, సినిమా, నాటక వేదికలు, సాహిత్యం లాంటి కళలు మానవ నిత్య జీవితంగా ఓ ప్రధాన భాగం అయ్యాయి. ఇలాంటి శక్తివంతమైన కళారూపాలతో పౌరసమాజ చైతన్యం జరుగుతోంది. ప్రపంచ కళా దినోత్సవ వేదికగా కళా ప్రదర్శనలు, కార్యశాలలు, కళా బోధనలు, కళా శిక్షణలు, కళాకారులను ప్రోత్సహించడం, కళా ప్రదర్శనలకు సౌజన్య ప్రదాతలుగా నిలవడం, కళను సానబట్టడం జరగాలి. కళల మాద్యమంగా పిల్లల్లో అవగాహన పెంచడం విధిగా జరగాలి. కళకు చలించని లేదా స్పందిచని మనిషి లేదని గమనించి మనకు ఇష్టమైన కళలో శిక్షణ పొందడం లేదా కళాకారులను తట్టి ప్రోత్సహించడం నిరంతరం కొనసాగాయని ప్రపంచ కళా దినోత్సవం స్పష్టం చేస్తున్నదని మరువరాదు.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
సెల్:9949700037

# సరిహద్దు వాణిజ్యానికి కీలక మార్గంగా మారిన బారాబంకి - బహ్రైచ్ రహదారి

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 14:దక్షిణాసియాలో అత్యంత క్రియాశీలకమైన భూమార్గ వాణిజ్య సంబంధాలను భారత్, నేపాల్ కలిగి ఉన్నాయి. నేపాల్ మొత్తం విదేశీ వాణిజ్యంలో 60 శాతం కంటే ఎక్కువ వాటాతో భారత్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. ఇరు దేశాల లోతైన ఆర్థిక పరస్పర ఆధార సంబంధాలను ఇది ప్రతిబింబిస్తుంది. జాతీయ రహదారి-927లో భాగంగా బారాబంకి-బహ్రైచ్ మధ్య 4 లైన్ల నియంత్రిత ప్రవేశం కలిగిన రహదారి నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడంలో కీలక మార్పునకు శ్రీకారం చుట్టనుంది.

వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన రూపైదిహా భూమార్గ ఓడరేవు, దాని సమీపంలోని నేపాల్ గంజ్ నగరానికి ఈ ప్రాజెక్టు మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పిస్తుంది. ఇది సరిహద్దు వాణిజ్యాన్ని పెంచడమే కాకుండా, ప్రాంతీయ జీవనోపాధులకు మద్దతిస్తుంది. ఇరు పొరుగు దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని పెంపొందిస్తుంది. వివిధ సరిహద్దు పాయింట్లలో రూపైదిహా నేపాల్‌గంజ్ మార్గం అత్యంత ముఖ్యమైనది. భారత్ నుంచి నేపాల్‌కు జరిగే అత్యధిక ఎగుమతులు ఈ మార్గం ద్వారానే జరుగుతాయి. ఇప్పుడు నిర్మించబోయే కొత్త ఎన్‌హెచ్-927 రహదారి ద్వారా ప్రయాణం వేగవంతం కావడమే కాకుండా, రాబోయే ఏళ్లలో ఈ మార్గంలో వాణిజ్యం మరింత భారీగా పెరగనుంది.

### రెండు దేశాల మధ్య ఆహార, వ్యవసాయ వాణిజ్యానికి తోడ్పాటు

భారత్-నేపాల్ మధ్య ఈ మార్గం ద్వారా జరిగే వాణిజ్యంలో వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల రవాణా అత్యంత ముఖ్యమైనది. నేపాల్ ప్రజల రోజువారీ అవసరాల కోసం బియ్యం, గోధుమలు, కూరగాయలు, పాడి ఉత్పత్తులు, పశు గ్రాసం మోసుకెళ్లే ట్రక్కులు భారతీయ మార్కెట్ల నుంచి నిరంతరం అక్కడికి చేరుతుంటాయి. ఈ రహదారి ప్రాజెక్టు వల్ల బారాబంకి - బహ్రైచ్ మధ్య ప్రయాణ సమయం 150 నిమిషాల నుంచి 75 నిమిషాలకు.. అంటే దాదాపు 50 శాతం తగ్గుతుందని భావిస్తున్నారు. అంతేగాక వాహనాల సగటు వేగం గంటకు 40 కి.మీ నుండి 80 కి.మీకు పెరుగుతుంది. ప్రయాణం వేగవంతం కావడం వల్ల కూరగాయలు, పాలు వంటి త్వరగా పాడైపోయే వస్తువులు వృథా కాకుండా ఉంటాయి. దీంతో సరిహద్దుకు ఇరువైపులా ఉన్న రైతులు, వ్యాపారులు నేరుగా ప్రయోజనం పొందుతారు. మెరుగైన అనుసంధానం వల్ల తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని జిల్లాల రైతులు నేపాల్‌లోని పెద్ద మార్కెట్లను సులభంగా చేరుకోగలుగుతారు. తద్వారా వారి ఆదాయాలు పెరిగి, పంట కోత అనంతర నష్టాలు తగ్గే అవకాశం ఉంది.

### నిత్యావసర వస్తువుల నిరంతర సరఫరా

వ్యవసాయ ఉత్పత్తులే కాకుండా ఈ కారిడార్ ద్వారా మందులు, ఇతర వినియోగ వస్తువుల రవాణా కూడా జరుగుతుంది. నేపాల్ ఆర్థిక వ్యవస్థకు, అక్కడి ప్రజల దైనందిన జీవితానికి ఈ సరఫరా చాలా కీలకం. స్థిరమైన సరఫరా వ్యవస్థను కొనసాగించడానికి నిరాటంకమైన రవాణా మార్గాలు చాలా అవసరం. గతంలో వ్యాపార కార్యకలాపాలు మందగించిన సమయాల్లో సరిహద్దుల వద్ద రవాణా ఇంధనం, కూరగాయలు, ఇతర సరుకులతో ఉన్న వందలాది ట్రక్కులు నిలిచిపోయేవి. దీనివల్ల రోజుకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లడమే కాకుండా వ్యాపారులు, వినియోగదారులు కూడా ప్రభావితమయ్యారు. ఇప్పుడు నిర్మించబోయే ఆధునిక రహదారి వల్ల ఇటువంటి జాప్యాలు తగ్గి, రవాణా ఖర్చులు కూడా తగ్గుతాయి. ఫలితంగా వినియోగదారులకు, వ్యాపారులకూ మేలు జరుగుతుంది.

సరుకు రవాణా వృద్ధికి ఊతం

మెరుగుపడిన ఈ రహదారి వ్యవస్థ రూపైదిహా వద్ద సరుకు రవాణా సౌకర్యాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తుంది. ఇక్కడ రోజువారీ ట్రక్కుల రాకపోకలు గణనీయంగా పెరుగుతాయని అంచనా వేస్తున్నారు, ఇది సరిహద్దు వాణిజ్య పరిమాణంలో బలమైన వృద్ధి సామర్థ్యాన్ని సూచిస్తుంది. ఈ పెరిగిన రాకపోకల వల్ల ఈ కారిడార్ పొడవునా గిడ్డంగులు, రవాణా సేవలు, సరుకు నిర్వహణ వ్యాపారాలకు అనేక అవకాశాలు లభిస్తాయి.

### సరిహద్దు ప్రాంత ప్రజల జీవితాల్లో మార్పు

బారాబంకి - బహ్రైచ్ రహదారి వల్ల కలిగే అత్యంత ముఖ్యమైన ప్రభావం బహ్రైచ్ జిల్లా, దాని చుట్టుపక్కల సరిహద్దు జిల్లాల్లో నివసించే ప్రజలపై కనిపిస్తుంది. రూపైదిహా సమీపంలోని పట్టణాల్లో ఉన్న సరిహద్దు మార్కెట్లు ప్రధానంగా సరిహద్దు అవతలి వైపు వినియోగదారులపై ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. కొన్ని స్థానిక వ్యాపారాల ప్రకారం.. తమ అమ్మకాలలో అధిక భాగం నేపాల్ కొనుగోలుదారులపైనే ఆధారపడి ఉంది.

# ఏప్రిల్ 13న 'నారీ శక్తి వందన్' సమ్మేళనంలో ప్రసంగించనున్న పీఎం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: ఏప్రిల్ 13, 2026న ఉదయం 11 గంటల సమయంలో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జాతీయ స్థాయి 'నారీ శక్తి వందన్' సమ్మేళనంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తారు.

ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహిళలు పాల్గొంటారు. ప్రభుత్వం, విద్యారంగం, శాస్త్ర సాంకేతిక, క్రీడలు, వ్యాపార రంగం, మీడియా, సామాజిక సేవ, సాంస్కృతిక రంగాల ప్రతినిధులు ఈ సమ్మేళనానికి విచ్చేయనున్నారు.

శాసనసభల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచే దిశగా సెప్టెంబర్ 2023లో 'నారీ శక్తి వందన్ అధినియం'ను పార్లమెంట్ ఆమోదించి చరిత్రాత్మక ముందడుగు వేసింది. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు మూడో వంతు సీట్ల రిజర్వేషన్‌ను ఈ చట్టం కల్పిస్తుంది. దేశవ్యాప్తంగా మహిళా రిజర్వేషన్ల అమలుపై దృష్టి సారిస్తూ ఏప్రిల్ 16న పార్లమెంట్ సమావేశం జరగనుంది.

భారత అభివృద్ధి పథాన్ని నిర్దేశించటంలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పటిష్ఠం చేసే లక్ష్యంతో ఈ సమ్మేళనం జరుగుతుంది. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు అన్ని స్థాయిల్లో పెరుగుతున్న మహిళా నాయకత్వాన్ని ఇది తెలియజేస్తుంది. నిర్ణయాధికార ప్రక్రియల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాల్సిన ఆవశ్యకతను ఈ సమ్మేళనం స్పష్టం చేస్తుంది.

వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో మహిళల పాత్రను ఈ సమ్మేళనం తెలియజేస్తుంది.

# అగ్నిమాపక సిబ్బంది పాత్ర ఎంతో కీలకం



మచిలీపట్నం, ఏప్రిల్ 14: జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్థానిక రేవతి సెంటర్ లో గల అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించి ఈరోజు నుండి 20వ తేదీ వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన బ్రోచర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలను నివారించుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు.

ఆపద సమయాలలో ప్రజల ప్రాణాలను రక్షించడంలో అగ్నిమాపక సిబ్బంది పాత్ర ఎంతో కీలకమన్నారు. తొలుత అగ్నిమాపక కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఉపయోగించే పలు పరికరాలు జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

# అంబేద్కర్ ఆకాంక్షలను నెరవేర్చేందుకు కంకణ బద్ధులమవుదాం



నల్గొండ, ఏప్రిల్ 14: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలను కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, దళిత, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడు ఎస్కే నయీమ్, సత్యబాబు, కౌన్సిలర్ చీమ నరేష్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బస్టాండ్ ఎదుట అంబేద్కర్ విగ్రహానికి ఎంవి ఐ జిలాని, రాయపూడి చిన్ని ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఉస్మానియా అరుణతార జార్జిరెడ్డి వర్ధంతిని స్థానిక ఎమ్మెన్ కళాశాలలో పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థులు నిర్వహించారు. ఈ పలువురు వక్తలు సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ ఆకాంక్షలు నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరు కంకణబద్ధులు కావాలన్నారు.

# సామాజిక సమానత్వ మార్గదర్శకుడు భారతరత్న అంబేద్కర్

**-సామాజిక సమానత్వ మార్గదర్శకుడు భారతరత్న అంబేడ్కర్**
**-గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**



అమరావతి, ఏప్రిల్ 14: రాజ్యాంగ నిర్మాతగా, సామాజిక సమానత్వానికి మార్గదర్శకుడిగా భారత దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహానుభావుడు, భారతరత్న డా.బి.ఆర్. అంబేద్కర్ అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కొనియాడారు.సమాజమే దేవాలయం ప్రజల దేవుళ్ళన్న ఎన్టీఆర్ నినాదం అంబేద్కర్ స్ఫూర్తితో పుట్టిందేనని ఆయన అన్నారు.

గుడివాడ ప్రజా వేదిక (టీడీపీ)కార్యాలయంలో భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మంగళవారం ఉదయం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కూటమి నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి, జోహార్ అంబేద్కర్‌జై భీమ్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే రాము అంబేద్కర్ జయంతి కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ. హక్కు అంటే ఏమిటో తెలియని అణగారిన స్థాయి నుండి జీవితాన్ని ప్రారంభించి కోట్లాదిమందికి హక్కులు కల్పించిన మహోన్నతుడు అంబేద్కర్, ప్రపంచంలోనే అరుదైన మహానేత అని కొనియాడారు.

గత ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను తుంగలో తొక్కితే అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ముందు సాగుతుందని ఎమ్మెల్యే రాము అన్నారు.

అనంతరం జై భీమ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్ సెంటర్, ఆదిమాంధ్ర సంఘం, పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ లోని అంబేద్కర్ భవన్లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాము అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి, కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే రాము దళిత సంఘాల నాయకులకు, అంబేద్కర్ అభిమానులకు తినిపించారు.

జయంతి వేడుకల్లో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యాడ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, గుడివాడ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య,మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి,బిజెపి నాయకుడు అంగడాల సతీష్, టిడిపి నాయకులు కంచర్ల సుధాకర్, పిన్నమనేని బాబ్జి, గుడివాడ జోన్స్, మెరుగు మోజెస్, కరె వెంకటగిరి, చేకూరు జగన్మోహన రావు, పిల్ల సాల్మన్ రాజు, నిరంజన్, వేసపోగు ఇమ్మానుయేలు, రెడ్డి అప్పారావు, రెడ్డి షణ్ముఖ,యార్లగడ్డ సుధారాణి, సిరిపురపు తులసీరాణి, మాదాల సునీత , అందుగుల యేసు పాదం, పైడిముక్కల వంశీ, కనకాంబరం, డొక్కు మాల శ్రీకాంత్, రామిదేని వేణుబాబు, గడ్డం ప్రకాశ్ దాస్, వంగపండు ఆదినారాయణ, మజ్జాడ నాగరాజు తెలుగు యువత, తెలుగు మహిళలు, అనుబంధు విభాగాల నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

# టీ.ఎన్.ఎస్. ఎఫ్ లోకి పలువురు చేరిక

అమరావతి, ఏప్రిల్ 14: సింగ్ నగర్‌లోని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో కమ్యూనిస్ట్ పార్టీ నుండి తెలుగుదేశం పార్టీ అనుబంధ విద్యార్థి విభాగం టి.ఎన్. ఎస్.ఎఫ్ లోకి పలువురు విద్యార్థులు చేరారు. వారిని సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా పార్టీ కండువాలు మెడలో వేసి అహ్వానం పలికారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు.

బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్, టీఎన్టీయుసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, నవనీతం సాంబశివరావు, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్, టి. ఎన్. ఎస్. ఎఫ్. జిల్లా కార్యదర్శి పుల్లగూర చరణ్, సెంట్రల్ నియోజకవర్గ అధ్యక్షుడు బంగారపు సతీష్, శివాలయం గుడి డైరెక్టర్ బండ సూర్య తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 16వరకు న్యూఢిల్లీలో భారత నౌకాదళం తొలి కమాండర్ల సదస్సు-2026

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:ఏప్రిల్ 14 నుంచి 16 వరకు మూడు రోజుల పాటు భారత నౌకాదళ తొలి ద్వైవార్షిక కమాండర్ల సమావేశం-2026 న్యూఢిల్లీలోని నౌసేనా భవన్‌లో నిర్వహిస్తారు. జాతీయ సముద్ర ప్రయోజనాలను కాపాడేందుకు నౌకాదళ సంసిద్ధతను సమగ్రంగా సమీక్షించటం, సామర్థ్య అభివృద్ధి, జాతీయ భద్రతా లక్ష్యాలకు అనుగుణంగా వ్యూహాత్మక ప్రణాళికను రూపొందించటంపై ఈ అత్యున్నత స్థాయి సమావేశం దృష్టి సారిస్తుంది.

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలు, హిందూ మహాసముద్ర ప్రాంతంలో అంతర్జాతీయ దళాల మోహరింపు నేపథ్యంలో భారత ఇంధన భద్రతను కాపాడేందుకు చేపట్టిన వేగవంతమైన నౌకాదళ కార్యాచరణ దృష్ట్యా ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత నౌకాదళ కార్యాచరణ సిద్ధాంతాన్ని స్పష్టం చేయటానికి, త్రివిధ దళాల మధ్య సమన్వయం, సాంకేతికత ఆధారంగా ప్రతిస్పందన వ్యవస్థలను బలోపేతం చేయటానికి కీలకంగా ఈ సమావేశం నిలుస్తుంది.

ఈ సదస్సులో భాగంగా త్రివిధ దళాధిపతి, హోంశాఖ కార్యదర్శి ప్రసంగాలతో పాటు నౌకాదళం సీనియర్ అధికారుల స్థాయిలో చర్చలు జరుగు తాయి. త్రివిధ దళాల మధ్య పరస్పర సహకారాన్ని, సమగ్రతను పెంపొందించటం ఈ చర్చల ప్రధాన లక్ష్యం. జాతీయ స్థిరత్వం, భద్రతా వ్యవస్థ, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను సమష్టిగా ఎదుర్కొనే విధానాలపై విస్తృత అవగాహనను పెంపొందించుకోవటానికి ఈ చర్చలు సహకరిస్తాయి. ఈ సదస్సు జాతీయ నాయకత్వంతో సన్నిహిత సంభాషణలకు వేదికగా నిలుస్తూ.. నౌకాదళ ప్రణాళికలకు వ్యూహాత్మక దిశానిర్దేశం చేస్తుంది.

ప్రస్తుత భౌగోళిక వ్యూహాత్మక వాతావరణంలోని వివిధ సవాళ్లను ఎదుర్కోవటానికి అవసరమైన ప్రణాళికలను నౌకాదళాధిపతి, కార్యాచరణ కమాండర్లు, సీనియర్ నౌకాదళ నాయకత్వంతో కలిసి రూపొందిస్తారు. భద్రతతో పాటు నిర్ణయాత్మక కార్యాచరణ విజయాన్ని సాధించటం, మహాసముద్రంలో సామర్థ్యాన్ని పెంపొందించటం, శిక్షణ, మానవ వనరుల నిర్వహణ, స్థిర నిర్వహణ పద్ధతులు, మానవ రహిత వ్యవస్థల సమర్థవంతమైన వినియోగం, కార్యాచరణ నిర్వహణ, యుద్ధ సంసిద్ధతను పెంచే కీలక అంశాలపై ఈ చర్చలు ప్రధానంగా దృష్టి సారించనున్నాయి. నౌకాదళంలో సమస్యల పరిష్కారానికి ఏఐ రోడ్‌మ్యాప్ అమలు, నిరంతర కార్యకలాపాల కోసం డేటా ఆధారిత సాంకేతికతపైనా చర్చలు జరుగుతాయి.

భారత నౌకాదళ సిద్ధాంతం (ఐఎండీ)లో వివరించిన నావికాదళ నాలుగు కీలక పాత్రలకు అనుగుణంగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు సైనిక విజయాన్ని అందించేందుకు సన్నద్ధతను నౌకాదళ అగ్ర నాయకత్వం సమీక్షిస్తుంది. నిరంతర కార్యకలాపాలు, అంతర్జాతీయ సహకారాన్ని విస్తరించటం, భారత ప్రభుత్వ విజన్ మ్యూచువల్ అండ్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్ ఫర్ సెక్యూరిటీ ఎక్రాస్ రీజియన్స్ (మహాసాగర్)ను ముందుకు తీసుకెళ్లటం, స్వదేశీ పరిజ్ఞానం, ఆవిష్కరణల వైపు సాగించే ప్రయత్నాలపై దృష్టి సారిస్తుంది. ఐఓఆర్, ఇండో-పసిఫిక్ ప్రాంతం లో అత్యంత ప్రాధాన్యత గల భద్రతా భాగస్వామిగా భారత నౌకాదళాన్ని నిలబెట్టటవే లక్ష్యంగా ఈ సదస్సులో చర్చలు జరుగుతాయి.

# అంబేద్కర్‌కు ఘన నివాళులు..

అమరావతి, ఏప్రిల్ 14:మంగళవారం నవ భారత రాజ్యాంగ నిర్మాత-భారత రత్న బాబా సాహెబ్ డా. బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి మహోత్సవం సందర్భంగా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులతో కలిసి డా. బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

# డా॥బీఆర్ అంబేద్కర్ ఆశయాలు..అభివృద్ధికి దారిదీపాలు

## -మహనీయుడు అందించిన స్ఫూర్తితో ముందుకు సాగుదాం..
## -ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్
## -డా.జి.లక్ష్మీశ, శాసనసభ్యుడు బోండా ఉమామహేశ్వరరావు.



అమరావతి, ఏప్రిల్ 14:: భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలు సమాజ అభివృద్ధికి మార్గదర్శకాలని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ, శాసనసభ్యుడు బోండా ఉమామహేశ్వరరావులు అన్నారు.అంబేద్కర్ సమానత్వం,సామాజిక న్యాయం, విద్యకు ఇచ్చిన ప్రాధాన్యత దేశ ప్రగతికి బలమైన పునాది అని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సెంట్రల్ శాసనసభ్యుడు బోండా ఉమామహేశ్వరరావు అన్నారు.

మంగళవారం నవ భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న బాబా సాహెబ్ డా.బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి మహోత్సవం సందర్భంగా నగరంలోని డా. బీఆర్ అంబేద్కర్ స్మృతివనంలోని డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అంబేద్కర్ అందించిన స్ఫూర్తితో ముందడుగు వేస్తూ ప్రగతిపథ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.డా. బీఆర్ అంబేద్కర్ కుల వివక్ష నిర్మూలనకు, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం అహర్నిశలు కృషిచేశారని, సమాజంలోని ప్రతిఒక్కరూ స్వేచ్ఛ, సమానత్వం, హక్కుల ఫలాలు అందుకునేలా చేశారని శాసనసభ్యులు ఉమామహేశ్వరరావు అన్నారు. విద్యను సాధనంగా తీసుకుని వ్యక్తి మాత్రమే కాకుండా సమాజం మొత్తం అభివృద్ధి చెందాలన్న ఆయన సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వం కూడా అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని, ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించేందుకు చిత్తశుద్ధితో కృషిచేస్తోందని.. వీటిని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు.

# "రైస్ పుల్లింగ్" పేరుతో మోసం

## నలుగురు అరెస్ట్, ఇద్దరు పరారీ

అమరావతి, ఏప్రిల్ 14: "రైస్ పుల్లింగ్" పేరుతో మోసం చేసి డబ్బులు దోచుకున్న ఘటనలో పంజాని పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా బరుగూరు తాలూకా సూరంకుటై గ్రామానికి చెందిన బి. శేఖర్ (60) అనే వ్యక్తి ఏప్రిల్ 12వ తేదీ రాత్రి పంజాని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆరుగురు వ్యక్తులు "రైస్ పుల్లింగ్" చేస్తామని, తమ వద్ద ప్రత్యేకమైన పాత్ర ఉందని నమ్మబలికి ఒక లక్ష రూపాయలు అడ్వాన్స్‌గా తీసుకున్నారని, అనంతరం అనుమానం రావడంతో వారు అక్కడి నుంచి పరారైనట్లు పేర్కొన్నాడు.

ఈ ఫిర్యాదు మేరకు పంజాని పోలీస్ స్టేషన్‌లో క్రైం నెంబర్ 40/2026గా కేసు నమోదు చేసి, ఃఔా 318(4), 62 తీ/లి 3(5) సెక్షన్ల కింద విచారణ ప్రారంభించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ పర్యవేక్షణలో, పలమనేరు రూరల్ సీఐ పరశరాముడు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటైంది.

పంజాని ఎస్.ఐ మారెప్ప సిబ్బందితో కలిసి సాంకేతిక ఆధారాలు సేకరించి దర్యాప్తు చేపట్టగా, ఏప్రిల్ 13వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు పంజాని మండం కొగిలేరు క్రాస్ వద్ద నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు.

అరెస్ట్ అయిన నిందితులు కృష్ణప్ప అలియాస్ గణపతి (కుంభారలపల్లి, వి.కోట మండలం), ఎరుకుల విజయ్ కుమార్ (మేకలచిన్నెపల్లి, చౌడేపల్లి మండలం), కె.ఎం. మునీష్ (కురుగల్ గ్రామం, కొలార్ జిల్లా), షేక్ ఇలియాజ్ (కమ్మేపల్లి, వి.కోట మండలం)గా గుర్తించారు.

ఇక శంకర్ (రాజులూరు, చౌడేపల్లి మండలం), నాగరాజు (గౌనివారిపల్లి, పెద్ద పంజాణి మండలం) పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు.

"రైస్ పుల్లింగ్", "మ్యాజిక్ కాయిన్స్", "పవర్ ఉన్న పాత నాణేలు'', ''పారంపరిక వస్తువులు డబ్బు తీస్తాయి" వంటి పేర్లతో మోసగాళ్లు ప్రజలను మభ్యపెట్టి డబ్బులు దోచుకుంటున్నారని పోలీసులు హెచ్చరించారు.

ఇటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా 112కు సమాచారం అందించాలని సూచించారు.

# ఐపీఎల్ బెట్టింగ్‌పై పోలీసుల దాడి..



చిత్తూరు, ఏప్రిల్ 14: ఐపీఎల్ మ్యాచ్‌లను ఆధారంగా చేసుకుని నిర్వహిస్తున్న ఆన్లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలపై చిత్తూరు పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు. మరో ఐదుగురు పరారిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

జిల్లాలో బెట్టింగ్ కార్యకలాపాలను అరికట్టాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఎస్.ఆర్. రాజశేఖర్ రాజు పర్యవేక్షణలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 13వ తేదీ రాత్రి సుమారు 8.45 గంటల సమయంలో చిత్తూరు 2 టౌన్ పోలీసులకు అందిన సమాచారంతో చర్యలు చేపట్టారు.

బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్డులో మూసివేసిన శృతి మిల్క్ డైరీ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో కొందరు వ్యక్తులు ఆన్లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారని సమాచారం అందడంతో 2 టౌన్ ఇన్‌స్పెక్టర్ నెట్టికంటయ్య, ఎస్.ఐ రమేష్ బాబు, సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఈ సమయంలో అక్కడ ఉన్న నిందితులు పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించగా ఐదుగురిని పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు.

అరెస్ట్ చేసిన నిందితులపై 318(2), 61(2) ః?ఎన్ఎస్ సెక్షన్లు, ఏపీ గేమింగ్ యాక్ట్ 3, 4, 7, 15 సెక్షన్లు, ఐటీ యాక్ట్ 66 కింద కేసులు నమోదు చేసి విచారణ చేపట్టారు. విచారణలో నిందితులు ఐపీఎల్ మ్యాచ్‌లపై ఆన్లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.అరెస్ట్ అయిన వారిలో విక్రం రెడ్డి (30), వినోద్ కుమార్ అలియాస్ టైలర్ వినోద్ (39), రిజ్వాన్ (34), వంశీ కృష్ణ (34), అనీష్ అహ్మద్ (30) ఉన్నారు. వీరందరూ చిత్తూరు పట్టణానికి చెందిన వారే. ఇక కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న వినోద్, ఐశ్వర్యతో పాటు మనికంట, వేణు, భరత్ పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

ఐపీఎల్ మ్యాచ్‌లు లేదా ఇతర క్రీడల పేరుతో జరుగుతున్న ఆన్లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్ కార్యకలాపాలు చట్టవిరుద్ధమని పోలీసులు హెచ్చరించారు. ఇటువంటి కార్యకలాపాల్లో పాల్గొనడం వల్ల ఆర్థిక నష్టాలతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ఎవరైనా ఈ విధమైన బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా 112 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

# ఎల్‌పీజీ విషయంలో ఎక్కడా నమోదు కాని కొరత.. నిన్న 52.3 లక్షలకు పైగా గృహ వినియోగ సిలిండర్ల సరఫరా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం అక్కడి పరిణామాలను నిశితంగా పర్యవేక్షిస్తోంది. కీలక రంగాలలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన సంసిద్ధతను నిర్ధారించడానికి సమన్వయంతో కూడిన చర్యలను చేపడుతోంది. ఇంధన సరఫరా, సముద్రయాన కార్యకలాపాలు, ఆ ప్రాంతంలోని భారతీయులకు అవసరమైన సహాయం వంటి అంశాలలో తీసుకుంటున్న చర్యల తాజా సమాచారం ఈ విధంగా ఉంది:

హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో కొనసాగుతున్న పరిణామాల నేపథ్యంలో పెట్రోలియం ఉత్పత్తులు, ఎల్‌పీజీ నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చూడటానికి తీసుకుంటున్న చర్యలను పెట్రోలియం- సహజ వాయువు మంత్రిత్వ శాఖ వివరించింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి:

పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ విషయంలో ప్రజలు భయాందోళనతో కొనుగోళ్లు చేయొద్దని.. కేవలం అధికారిక వర్గాల నుంచి వచ్చే సమాచారాన్ని మాత్రమే నమ్మాలని సూచించారు.

ఎల్‌పీజీ వినియోగదారులు డిజిటల్ బుకింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించాలని.. డిస్ట్రిబ్యూటర్ల వద్దకు వెళ్లకుండా ఉండాలని కోరారు.

ప్రజలు పీఎన్‌జీ, ఎలక్ట్రిక్ లేదా ఇండక్షన్ కుక్‌టాప్‌ల వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ఉపయోగించాల్సిందిగా ప్రోత్సహించారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ఇంధనాన్ని పొదుపు చేయాల్సిందిగా ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ సంసిద్ధత, సరఫరా నిర్వహణ చర్యలు

ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ గృహాసరాల ఎల్‌పీజీ, పీఎన్‌జీ సరఫరాకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. దీనితో పాటు ఆసుపత్రులు, విద్యా సంస్థలకు గ్యాస్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా అధిక ప్రాధాన్యత ఇస్తోంది.

సరఫరా, డిమాండ్ రెండు అంశాల్లోనూ ప్రభుత్వం ఇప్పటికే పలు హేతుబద్ధీకరణ చర్యలను అమలు చేసింది. ఇందులో భాగంగా చమురు శుద్ధి కేంద్రాల ఉత్పత్తిని పెంచడం.. ఎల్‌పీజీ బుకింగ్ గడువును పట్టణ ప్రాంతాల్లో 21 నుంచి 25 రోజులకు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వరకు పెంచడం.. కీలక రంగాలకు సరఫరాలో ప్రాధాన్యత ఇవ్వడం వంటి చర్యలు చేపట్టారు.

ఎల్‌పీజీ డిమాండ్ ఒత్తిడిని తగ్గించడానికి కిరోసిన్, బొగ్గు వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

చిన్న, మధ్యతరహా వినియోగదారులకు పంపిణీ చేయడం కోసం రాష్ట్రాలకు అదనపు బొగ్గును సరఫరా చేయాలని కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్‌ను బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశించింది.

గృహ, వాణిజ్య వినియోగదారుల విషయంలో కొత్త పీఎన్‌జీ కనెక్షన్‌లు పొందటాన్ని సులభతరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, సంస్థాగత యంత్రాంగాలతో సమన్వయ ప్రయత్నాలు

నిత్యావసరాల చట్టం- 1955, ఎల్‌పీజీ నియంత్రణ ఉత్తర్వు- 2000 ప్రకారం పెట్రోలియం ఉత్పత్తుల సరఫరాను పర్యవేక్షించడానికి.. అక్రమ నిల్వలు, నల్లబజారు క్రయవిక్రయాలపై చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉంది.

27.03.2026, 02.04.2026 నాటి లేఖల ద్వారా ఇంధనం తగినంతగా అందుబాటులో ఉందన్న భరోసాను ప్రజలకు ఇచ్చేందుకు ముందస్తు ప్రజా సమాచార మార్పిడి అవసరమని కేంద్రం ప్రభుత్వం ప్రధానంగా చెప్పింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో క్రమం తప్పకుండా సమీక్షా సమావేశాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. 02.04.2026న పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ కార్యదర్శి 06.04.2026న సమాచార – ప్రసార, వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శులతో కలిసి పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో కింది అంశాలను ప్రముఖంగా చెప్పారు:

ప్రతిరోజూ మీడియా సమావేశాలు నిర్వహించడం, క్రమం తప్పకుండా ప్రజా సూచనలను జారీ చేయడం.

సామాజిక మాధ్యమాల్లో వచ్చే నకిలీ వార్తలు, అవాస్తవ సమాచారాన్ని చురుగ్గా పర్యవేక్షించడం, తిప్పికొట్టడం.

జిల్లా యంత్రాంగం ద్వారా ప్రతిరోజూ తనిఖీలను ఉద్ధృతం చేయటం, ఓఎంసీలతో సమన్వయం చేసుకుంటూ దాడులు, తనిఖీలను కొనసాగించడం.

సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో వాణిజ్య ఎల్‌పీజీ కేటాయింపు ఉత్తర్వులను జారీ చేయడం.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అదనంగా కేటాయించిన కిరోసిన్ (ఎస్‌కేఓ) కోసం కేటాయింపు ఉత్తర్వులను జారీ చేయడం.

పీఎన్‌జీ వినియోగం, ప్రత్యామ్నాయ ఇంధనాలను ప్రోత్సహించడం.

ఎల్‌పీజీ సరఫరాలో ముఖ్యంగా గృహ అవసరాల ఎల్‌పీజీ సరఫరాలో స్థిరత్వాన్ని నిర్ధారించడానికి 5 కేజీల ఎఫ్‌టీఎల్ సిలిండర్ల లక్షిత పంపిణీ విధానాన్ని అనుసరించడం.

అక్రమ నిల్వ, నల్లబజారు క్రయవిక్రయాలను అరికట్టడానికి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కంట్రోల్ రూంలు, జిల్లా స్థాయి పర్యవేక్షక కమిటీలను ఏర్పాటు చేశాయి.

ప్రస్తుతం 24 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు క్రమం తప్పకుండా మీడియా సమావేశాలను నిర్వహిస్తున్నాయి.

అమలు, పర్యవేక్షణ చర్యలు

ఎల్‌పీజీ అక్రమ నిల్వ, నల్లబజారు క్రయవిక్రయాలను అరికట్టడానికి దేశవ్యాప్తంగా అమలు చర్యలు కొనసాగుతున్నాయి. 11.04.2026 నాడు దేశవ్యాప్తంగా 2700 కంటే ఎక్కువ దాడులు నిర్వహించారు.

ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు ఆకస్మిక తనిఖీలను మరింత ముమ్మరం చేశాయి. నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను ఇప్పటివరకు 219 ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ షిప్‌లపై జరిమానాలు విధించాయి.. 56 డిస్ట్రిబ్యూటర్ షిప్‌లను సస్పెండ్ చేశాయి.

ఎల్‌పీజీ సరఫరా

గృహావసరాల ఎల్‌పీజీ

ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల కారణంగా ఎల్‌పీజీ సరఫరాపై ప్రభావం కొనసాగుతోంది.

ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్‌షిప్‌ల వద్ద ఎక్కడా నిల్వల కొరత ఉన్నట్లు నివేదికలు అందలేదు.

పరిశ్రమవ్యాప్తంగా ఆన్‌లైన్ ఎల్‌పీజీ బుకింగ్‌లు సుమారు 98 శాతానికి పెరిగాయి.

సిలిండర్ల దారి మళ్లింపును అరికట్టడానికి డెలివరీ ఆథెంటికేషన్ కోడ్ (డీఏసీ) ఆధారిత పంపిణీ విధానాన్ని సుమారు 93 శాతానికి పెంచారు.

గృహావసరాల ఎల్‌పీజీ సిలిండర్ల పంపిణీ సాధారణంగానే కొనసాగుతోంది.

11.04.2026 నాడు 52.3 లక్షలకు పైగా గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్లు సరఫరా అయ్యాయి.

వాణిజ్య ఎల్‌పీజీ సరఫరా, కేటాయింపు చర్యలు

మొత్తం వాణిజ్య ఎల్‌పీజీ కేటాయింపులు సంక్షోభానికి ముందు ఉన్న స్థాయిలో సుమారు 70 శాతానికి పెరిగాయి. ఇందులో 10 శాతం సంస్కరణలతో ముడిపడి ఉన్న కేటాయింపులు కూడా ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వం 08.04.2026 నాటి లేఖ ద్వారా.. ఫార్మా, ఆహార రంగం, పాలిమర్, వ్యవసాయం, ప్యాకేజింగ్, పెయింట్, యురేనియం, భారజలం, ఉక్కు, విత్తనాలు, లోహాలు, సిరామిక్, ఫౌండ్రీ, ఫోర్జింగ్, గాజు, ఏరోసోల్ మొదలైన రంగాల్లోని పారిశ్రామిక విభాగాలు కూడా 2026 మార్చికి ముందు ఉన్న తమ బల్క్ గృహేతర ఎల్‌పీజీ వినియోగ స్థాయిలో 70 శాతాన్ని పొందుతాయని తెలియజేసింది. అయితే ఇది రోజుకు 0.2 టీఎంటీ అనే మొత్తం రంగాల పరిమితికి లోబడి ఉంటుంది.

గడిచిన 8 రోజుల్లో ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (పీఎస్‌యూ ఓఎంసీ) 5 కేజీల ఎఫ్‌టీఎల్ సిలిండర్లపై సుమారు 3300 అవగాహన శిబిరాలను నిర్వహించాయి. ఈ శిబిరాల ద్వారా 35,800 కంటే ఎక్కువ 5 కేజీల ఎఫ్‌టీఎల్ సిలిండర్లు విక్రయమయ్యాయి.

11.04.2026 నాడు దేశవ్యాప్తంగా 1 లక్ష కిలోల కంటే ఎక్కువ ఎఫ్‌టీఎల్ సిలిండర్లు విక్రయమయ్యాయి. ఇది 2026 ఫిబ్రవరి నెలలోని రోజువారీ సగటు అయిన 77,000 కంటే చాలా ఎక్కువ.

2026 మార్చి 23 నుంచి ఇప్పటివరకు 13 లక్షలకు పైగా 5 కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్లు విక్రయమయ్యాయి.

వాణిజ్య ఎల్‌పీజీ పంపిణీని ప్రణాళికాబద్ధంగా నిర్వహించడానికి ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ సంస్థల కార్యనిర్వాహక డైరెక్టర్లతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీ.. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పరిశ్రమల విభాగాలతో సమన్వయం చేసుకుంటోంది.

2026 మార్చి 14 నుంచి ఇప్పటివరకు మొత్తం 1,20,898 మెట్రిక్ టన్నుల (ఎంటీ) వాణిజ్య ఎల్‌పీజీ విక్రయమైంది. 63.6 లక్షలకు పైగా (19 కిలోల బరువు గల) వాణిజ్య సిలిండర్లతో సమానం ఇది.

11.04.2026 నాడు ఒక్క రోజే 7665 మెట్రిక్ టన్నుల వాణిజ్య ఎల్‌పీజీ విక్రయమైంది. 4 లక్షలకు పైగా (19 కిలోల బరువు గల) వాణిజ్య సిలిండర్లతో సమానం ఇది.

సహజ వాయువు సరఫరా... పీఎన్‌జీ విస్తరణకు చర్యలు

దేశీయ పీఎన్‌జీ, సీఎన్‌జీ రవాణాకు 100% సరఫరాతో వినియోగదారులకు ప్రాధాన్యం.

అందుబాటులోగల నిల్వలు, షెడ్యూల్ ప్రకారం- ఎల్ఎన్‌జీ దిగుమతి ఆధారంగా, ఎరువుల కర్మాగారాలకు వాటి 6 నెలల సగటు వినియోగంలో సుమారు 95 శాతానికి చేరువగా, మొత్తం గ్యాస్ కేటాయింపును 09.04.2026 నుంచి మరో 5 శాతం పెంచారు.

వాణిజ్య ఎల్‌పీజీ లభ్యత సంబంధిత సమస్యల పరిష్కారం దిశగా హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాంటీన్ల వంటి వాణిజ్య సంస్థలకు పీఎన్‌జీ కనెక్షన్లలో ప్రాధాన్యం ఇవ్వాలని సీజీడీ సంస్థలకు ఆదేశాలు.

ఐజీఎల్, ఎంజీఎల్, గెయిల్ గ్యాస్, బీపీసీఎల్ వంటి సీజీడీ కంపెనీల ద్వారా దేశీయ, వాణిజ్య పీఎన్‌జీ కనెక్షన్లకు ప్రోత్సాహకాల మంజూరు.

సీజీడీ నెట్‌వర్క్ విస్తరణకు సత్వర అనుమతులు ఇవ్వాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు సహా కేంద్ర మంత్రిత్వ శాఖలకు సూచన.

ఎల్‌పీజీ నుండి పీఎన్‌జీకి దీర్ఘకాలిక మార్పు దిశగా రాష్ట్రాల తోడ్పాటుకు ప్రతిగా వాణిజ్య ఎల్‌పీజీలో అదనంగా 10 శాతం కేటాయిస్తామని కేంద్ర ప్రభుత్వం 18.03.2026 నాటి లేఖ ద్వారా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు హామీ ఇచ్చింది.

ఎల్‌పీజీ నుండి పీఎన్‌జీకి దీర్ఘకాలిక మార్పులో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమవంతు తోడ్పాటునిస్తేనే ఈ కేటాయింపు వర్తిస్తుంది. అయితే, పీఎన్‌జీ విస్తరణలో సంస్కరణలకు అనుసంధానం కింద 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఇప్పటికే అదనపు వాణిజ్య ఎల్‌పీజీ లభిస్తోంది.

ప్రాధాన్య క్రమంలో దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి సీజీడీ మౌలిక సదుపాయాల కోసం మూడు నెలల పాటు సత్వర ఆమోద చట్రాన్ని రోడ్డు రవాణా-రహదారుల మంత్రిత్వ శాఖ అమలు చేస్తోంది.

కేంద్ర ప్రభుత్వం 24.03.2026న గెజిట్ ప్రకటన ద్వారానే కాకుండా నిత్యావసర వస్తువుల చట్టం-1955 కింద సహజ వాయువు, పెట్రోలియం ఉత్పత్తుల పంపిణీ (పైప్‌లైన్లు, ఇతర సౌకర్యాల కల్పన, నిర్మాణం-నిర్వహణ-విస్తరణ)ఉత్తర్వు-2026ను జారీ చేసింది. దీంతో దేశవ్యాప్తంగా పైప్‌లైన్ల నిర్మాణం, విస్తరణకు క్రమబద్ధ-వ్యవధి నిర్దేశిత చట్రం అమలులోకి వస్తుంది. తద్వారా అనుమతులు, భూసేకరణలో జాప్యాలను నివారించి, ఆవాస ప్రాంతాలు సహా సహజ వాయువు మౌలిక సదుపాయాల సత్వర అభివృద్ధికి వీలు కలుగుతుంది. దీనివల్ల పీఎన్‌జీ నెట్‌వర్క్ వృద్ధిని వేగిరపరచడమే కాకుండా చివరి అంచె అనుసంధానాన్ని మెరుగుపరుస్తుంది. అలాగే, కాలుష్యరహిత ఇంధనాల వైపు మళ్లేందుకు తోడ్పడుతుందని, దీంతో ఇంధన భద్రత బలోపేతమై గ్యాస్ ఆధారిత భారత ఆర్థిక వ్యవస్థ పురోగమనానికి దోహదం చేస్తుందని భావిస్తున్నారు. పీఎన్‌జీ విస్తరణలో వేగం కొనసాగింపు లక్ష్యంగా జాతీయ పీఎన్‌జీ కార్యక్రమం 2.0ను 2026 జూన్ 30 వరకు పీఎన్‌జీఆర్‌బీ పొడిగించింది.

కాలుష్య రహిత, సురక్షిత, స్వయంసమృద్ధి సహిత ఇంధన భవిష్యత్తును ప్రోత్సహించే దిశగా ముసాయిదా రాష్ట్ర సీబీజీ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. సీబీజీ అభివృద్ధి కోసం రాష్ట్రాలు తమ సొంత పెట్టుబడిదారులకు అనుకూల, అమలు హితవైన వ్యవస్థను ఈ నమూనా విధానం ద్వారా రాష్ట్రాలు సృష్టించుకోవచ్చు. ఈ మేరకు సమగ్ర, సరళ, మార్గదర్శక చట్రంగా ఈ విధానం దోహదపడుతుంది. దీన్ని అమలు చేసే రాష్ట్రాలకు వాణిజ్య ఎల్పీజీ అదనపు కేటాయింపులకు సంబంధించి తదుపరి విడతలో ప్రాధాన్యం లభిస్తుంది.

2026 మార్చి నుంచి 4.24 లక్షలకు పైగా పీఎన్‌జీ కనెక్షన్ల గ్యాసిఫికేషన్ పూర్తయింది. అలాగే, కొత్త కనెక్షన్ల కోసం మరో 4.66 లక్షల మందికి పైగా నమోదు చేసుకున్నారు.

మరోవైపు 11.04.2026 నాటికి 30,000 మందికి పైగా పీఎన్‌జీ వినియోగదారులు ఎల్పీజీ కనెక్షన్లను వదులుకున్నారు.

ముడిచమురు నిల్వలు... శుద్ధి కర్మాగారాల కార్యకలాపాలు

దేశంలో తగినంత ముడి చమురు నిల్వలు అందుబాటులో ఉండటంతో శుద్ధి కర్మాగారాలన్నీ అదనపు సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. దీంతోపాటు పెట్రోల్, డీజిల్ నిల్వల నిర్వహణ సంతృప్తికరంగా ఉంది.

దేశీయ వినియోగానికి కొరత రాకుండా శుద్ధి కర్మాగారాల్లో వంటగ్యాస్ ఉత్పత్తిని పెంచారు.

దేశంలోని ఫార్మాస్యూటికల్స్, ఆహార-ప్రజా పంపిణీ, రసాయనాలు-పెట్రో కెమికల్స్ వంటి కీలక రంగాలకు సి3, సి4 స్ట్రీమ్‌లను కనీస పరిమాణంలో... అంటే- రోజుకు 800 మెట్రిక్ టన్నుల వరకూ అందుబాటులో ఉంచే విధంగా దేశంలోని పెట్రోకెమికల్ ప్రాంగణాలు సహా శుద్ధి కంపెనీలను అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం 01.04.2026న ఒక ఉత్తర్వు జారీచేసింది.

చిల్లర విక్రయానికి ఇంధన లభ్యత... ధరల దిశగా చర్యలు

దేశవ్యాప్తంగా అన్ని చిల్లర విక్రయ కేంద్రాలు యథావిధిగా పనిచేస్తున్నాయి.

మధ్యప్రాచ్య సంక్షోభం వల్ల ముడిచమురు ధర అసాధారణంగా పెరిగింది. దీంతో వినియోగదారులను ఆదుకోవడానికి, కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.10 చొప్పున ఎక్సైజ్ సుంకం తగ్గించింది.దేశీయ మార్కెట్లో ఈ ఉత్పత్తుల లభ్యతకు భరోసా ఇస్తూ ఎగుమతి సుంకాన్ని లీటరు డీజిల్‌పై రూ.55.50కి, ఒక లీటరు ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్‌పై రూ.42కు పెంచుతూ 11.04.2026న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

చిల్లర విక్రయ కేంద్రాల్లో పెట్రోల్, డీజిల్ సాధారణ ధరలలో ఎలాంటి మార్పు లేదు.

సాధారణ కేటాయింపులకు అదనంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు 48,000 కిలోలీటర్ల కిరోసిన్‌ను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది.

# కీలక ఖనిజ బ్లాకులతో పాటు అన్వేషణ కోసం లైసెన్సులు ఇవ్వదలుస్తున్న బ్లాకులపై గనులశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రేపే రోడ్‌షో

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: కీలక, వ్యూహాత్మక బ్లాకుల 7వ విడత వేలంతో పాటు ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్ (ఈసీ) బ్లాకుల 2వ విడత వేలంపాటకు ఓ రోడ్‌షోను కేంద్ర ప్రభుత్వ గనుల శాఖ నిర్వహించనుంది. ఈ రోడ్‌షోను హైదరాబాద్ గచ్చిబౌలిలోని హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో 2026 ఏప్రిల్ 13న ఏర్పాటు చేశారు.

ఈ రోడ్‌షో కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి, గనుల శాఖ సీనియర్ అధికారులు, రాష్ట్రప్రభుత్వాల ప్రతినిధులు, పరిశ్రమకు చెందిన ఆసక్తిదారులు, ఔత్సాహిక వేలం దారులు పాల్గొంటారు.

ఏడో దఫా వేలంలో టంగ్‌స్టన్, లిథియం, తగరం, రాక్ ఫాస్ఫేట్ తదితరాలు సహా 19 కీలక, వ్యూహాత్మక ఖనిజ బ్లాకులు భాగంగా ఉన్నాయి. ఈ ఖనిజాలు స్వచ్ఛ ఇంధనం, ఆధునిక సాంకేతికతలు, ఎరువుల వంటి రంగాలకు ఎంతో కీలకం. ఇంతవరకు ఆరు విడతల వేలాన్ని నిర్వహించి, 45 కీలక ఖనిజాల బ్లాకుల వేలంపాటను విజయవంతంగా ముగించారు. ఈ వేలం ప్రక్రియ ఖనిజపరమైన భద్రత సాధనకు, దానితో పాటు దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించే దిశగా ప్రభుత్వం చేస్తున్న నిరంతర ప్రయత్నాలకు అద్దం పడుతోంది.

అన్వేషణ సంబంధిత లైసెన్స్ (ఈఎల్) బ్లాకుల రెండో దఫా వేలం ఈ రోడ్‌షో కార్యక్రమంలో మరో ముఖ్యాకర్షణగా ఉంది. అన్వేషణ కార్యకలాపాల్లో మరీ ముఖ్యంగా భూమిలో బాగా అడుగున ఉన్న, కీలక ఖనిజాల అన్వేషణలో ప్రయివేటు రంగం భాగస్వామ్యాన్ని పెంచడమూ ఈ వేలం ముఖ్యోద్దేశం. అన్వేషణ ప్రధాన లైసెన్సుల మంజూరు విధానం భూ పరిశీలన, అవకాశాల సూచక ప్రక్రియకు సువ్యవస్థీకృత ప్రణాళికను అందిస్తూ, తద్వారా దేశంలో అన్వేషణకు సంబంధించిన అనుబంధ విస్తారిత వ్యవస్థను బలోపేతం చేస్తుంది.

ఖనిజావకాశాలపై సమగ్ర నివేదికలతోపాటు వేలం ప్రణాళికనూ, విధాన సంస్కరణలనూ రోడ్‌షోలో వివరించనున్నారు. సందేహాలను నివృత్తి చేయడానికీ, మరిన్ని ఎక్కువ సంస్థలు భాగస్వామ్యం వహించడానికి ముందుకు వచ్చేలా మార్గాన్ని సుగమం చేయడానికీ ఆసక్తిదారులతో ఒక సమావేశ కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు.

స్వచ్ఛ ఇంధన వినియోగం దిశగా, 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాలను సాధించే మార్గంలో ముందుకు సాగిపోవడానికి సహాయపడుతూ ఖనిజ రంగాన్ని సుదృఢమైందిగానూ, స్వయంసమృద్ధి సహితమైందిగానూ తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ దృష్టికోణానికి అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

# నిరుపేదలతో పాటు సుదూర ప్రాంతాల ప్రజలకు సేవలందిస్తున్న భారతీయ రైల్వేలు..

## పెట్టుబడిలో ముందంజ వేస్తూ వైవిధ్య భరిత భారత్‌ను ఏకతాటి మీదకు తెస్తున్న రైల్వేలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:గిరిజన ప్రాంతాల్లో కొత్త రైలు మార్గాల ఏర్పాటు.. సమయ పాలనలో మెరుగుదలను దృష్టిలో పెట్టుకొని రద్దీ ఉన్న మార్గాల వ్యవస్థీకరణ... ప్రయాణికులకు మేలైన అనుభవాన్ని అందించడంపై ప్రత్యేక శ్రద్ధ

రూ.1.53 లక్షల కోట్ల పెట్టుబడి.. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 110 శాతం కన్నా ఎక్కువ.. భారత్‌లో ప్రపంచ స్థాయి అధిక సామర్థ్యం కలిగి ఉండే రైల్ నెట్‌వర్క్ అభివృద్ధికి 2025-26 ఆర్థిక సంవత్సరంలో 100 ప్రాజెక్టుల మంజూరు

కార్యకలాపాల నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపరచడం, ప్రయాణ కాలాన్ని తగ్గించడం, ఉద్యోగాల కల్పన, కీలక పరిశ్రమలకు ప్రోత్సాహంతో పాటు రవాణా ఖర్చులో తగ్గింపునకు తోడ్పడనున్న ప్రాజెక్టులివి

అన్ని ప్రధాన రాష్ట్రాలనూ చుట్టి వచ్చే ప్రాజెక్టులు.. దేశవ్యాప్తంగా ప్రయాణికులతో పాటు సరకు రవాణా సేవల మెరుగుదలకు అధిక జనసంఖ్య కలిగిన రాష్ట్రాలపై ప్రత్యేక శ్రద్ధ

సరకు రవాణా నడవాలు, పారిశ్రామిక అనుసంధానం, ప్రయాణికుల రాకపోకలను బలోపేతం చేయనున్న మహారాష్ట్ర, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్

పీఎం గతి శక్తి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా మార్కెట్లను, ఆరోగ్యసంరక్షణను, విద్యను, ఉపాధి అవకాశాల్ని అందరి అందుబాటులోకి తెస్తూ ప్రజలను ఏకతాటి మీద నిలిపే ప్రాజెక్టులు

రూ.1,000 కోట్ల కన్నా ఎక్కువ విలువ గల 35కు పైగా ప్రాజెక్టులు.. వాటిలో కసారా-మన్మాడ్, ఖర్సియా-నయా రాయ్‌పుర్-పర్మల్‌కసాతో పాటు ఇటార్సీ-నాగ్‌పుర్, సికందరాబాద్-వాడీ ల ఉన్నతీకరణ ప్రాజెక్టులు కూడా

కార్గోలో 3,000 ఎంటీల 'ఫోకస్డ్ మిషన్'.. నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచుతూ ఇంధన భద్రత, ఓడరేవుల అనుసంధానం, బొగ్గు సత్వర రవాణా, కోస్తా వాణిజ్యానికి దన్ను ఈ ప్రాజెక్టుల లక్ష్యాలు

నాడు పోస్టు చేయడమైనది: 12 ఒఖఖీ 2026 3:05ఖఓ ఎఎ ఖఎః ఊఎటవతీజీఎజీట

దేశంలో చివరి అంచెను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంతో పాటు నిరుపేదలకు, ఆదరణకు నోచుకోని ప్రాంతాలకూ సేవల్ని అందిస్తూ భారతీయ రైల్వేల సంస్థ 'పీఎం గతి శక్తి జాతీయ బృహత్ ప్రణాళిక' (పీఎం గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్)లో భాగంగా పరివర్తన ప్రధాన విస్తరణ కార్యక్రమాలను అమలు చేస్తోంది. సమ్మిళిత వృద్ధిపై, జాతీయ ఏకీకరణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ 2025-2626 ఆర్థిక సంవత్సరంలో కొత్త రైలు మార్గాలు, డబ్లింగు, మల్టీట్రాకింగులు సహా ఇతర పనులతో ముడిపెట్టిన 100 రైల్వే ప్రాజెక్టులను మంజూరు చేసింది. ఇదివరకు ఎన్నడూ ఎరుగని స్థాయిలో చేపట్టిన ఈ ప్రయత్నాలు మెరుగైన అనుసంధానం ద్వారా వివిధ రాష్ట్రాలను ఏకతాటి మీదకు తీసుకురావడంలో భారతీయ రైల్వేల నిబద్ధతను చాటి చెబుతున్నాయి. అంతేకాదు, అధిక సామర్థ్యం కలిగిన, రాబోయే కాలం అవసరాలను తీర్చగలిగిన నెట్‌వర్క్ ఏర్పాటుకు పునాదిని కూడా వేస్తున్నాయి.

ఈ ప్రాజెక్టులకు మొత్తం రూ.1.53 లక్షల కోట్ల పెట్టుబడిని నిర్దేశించారు. 6,000 కిలోమీటర్ల కన్నా ఎక్కువ రైల్వే నెట్‌వర్క్ వీటి పరిధిలోకి రానుంది. రైల్వే విస్తరణలో ఒక చరిత్రాత్మక ప్రగతి ప్రస్థానాన్ని ఇది సూచిస్తోంది. రూ.72,869 కోట్ల ఖర్చయ్యే 64 ప్రాజెక్టులకు (2,800 కిలోమీటర్ల కన్నా మించినవి) మంజూరునిచ్చిన 2024-25 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే, ఈ సారి ప్రాజెక్టుల అనుమతుల్లో 56 శాతం వృద్ధి చోటుచేసుకుంది. రూట్ కవరేజీలో 114 శాతాని కన్న ఎక్కువ పెరుగుదల ఉంది. ఆర్థిక సహాయంలో 110 శాతం కన్న ఎక్కువగా చెప్పుకోదగిన వృద్ధి నమోదైంది.

మంజూరు చేసిన 100 ప్రాజెక్టుల్లో కొత్త మార్గాలు, డబ్లింగు, మల్టీట్రాకింగ్ పనులతో పాటు, బైపాస్ లైన్లు, ఫ్లయ్ ఓవర్లు, కార్డ్ లైన్లు కలిసి ఉన్నాయి. రద్దీతో కూడిన మార్గాల్లో రద్దీని నివారించడం, రైళ్లు నిర్దిష్ట వేళలకు నడిచేలా చూడడం, ఇంతవరకు తగినంత సదుపాయాలకు నోచుకోని ప్రాంతాల వరకూ అనుసంధానాన్ని విస్తరించడం ఈ ప్రాజెక్టులకు నిర్దేశించిన వ్యూహాత్మక లక్ష్యాలు. ఈ కార్యక్రమాలను అమలు చేసినందువల్ల పూర్తి నెట్‌వర్క్ నిర్వహణ సామర్థ్యం చాలావరకూ మెరుగుపడుతుందని, ప్రయాణానికి పట్టే కాలం తగ్గుతుందన్న అంచనాలున్నాయి.

ఈ ప్రాజెక్టులు దాదాపు అన్ని ప్రధాన రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. వీటి ద్వారా రైల్వే నెట్‌వర్క్ సమతౌల్య, సమ్మిళిత విస్తరణకు మార్గం సుగమమవుతుంది. 17 ప్రాజెక్టులతో మహారాష్ట్ర, 11 ప్రాజెక్టులతో బీహార్, 10 ప్రాజెక్టులతో జార్ఖండ్, 9 ప్రాజెక్టులతో మధ్యప్రదేశ్ కీలక ఫోకస్ రాష్ట్రాలుగా తెర మీదకు వచ్చాయి. సరకు రవాణా నడవాలు (ఫ్రయిట్ కారిడార్స్), పారిశ్రామిక అనుసంధానం, ప్రయాణికుల అవసరాల రీత్యా వీటి భూమిక కీలకం. ఈ ప్రాంతాల్లో పెట్టుబడి విస్తృతి ప్రయాణికులకు సేవలనీ, సరకు రవాణాని చాలా వరకూ మెరుగుపరచనుంది.

మహారాష్ట్ర, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలలోని ఈ ప్రాజెక్టులతో సరకు రవాణా నడవాలు బలోపేతం కానున్నాయి. పారిశ్రామిక సంబంధాలు బలపడతాయి. ప్రయాణికుల రాకపోకలు మెరుగుపడతాయి. ఈ రాష్ట్రాలు భారత ఆధునిక రవాణా నెట్‌వర్కుకు వెన్నెముకగా ఉన్న నేపథ్యంలో ఈ రాష్ట్రాల్లో మెరుగైన అనుసంధానం ఏర్పడడం వల్ల పూర్తి ఆర్థిక వ్యవస్థకు విస్తృత ప్రయోజనాలు లభిస్తాయి.

పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లానుకు అనుగుణంగా, ఈ ప్రాజెక్టులు ఒక్క మౌలిక సదుపాయాల కల్పనకు మాత్రమే పరిమితం కాకుండా సామాజిక మార్పునకు దోహదపడతాయి. గిరిజన ప్రాంతాలతో పాటు దూర ప్రాంతాల్లో రైలు అనుసంధానాన్ని విస్తరించడంపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని రావ్‌ఘాట్-జగ్‌దల్‌పూర్ మార్గం వంటి చరిత్రాత్మక కార్యక్రమం, జార్ఖండ్, ఒడిశాల్లోని అనేక ఇతర నడవాలు మార్కెట్లతో పాటు ఆరోగ్య సంరక్షణ, విద్య, ఉపాధి సంబంధిత అవకాశాల్ని అందుబాటులోకి తీసుకు రానున్నాయి. దీంతో ఆదరణకు నోచుకోని జనులను జాతీయ అభివృద్ధి తాలూకు ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడం సాధ్యమవుతుంది.

ఆర్థిక దృష్టికోణంలో నుంచి పరిశీలించినప్పుడు ఈ విస్తరణ పెద్ద ఎత్తున పరివర్తన ప్రధాన పెట్టుబడుల దిశగా ఒక నిర్ణయాత్మక మార్పును సూచిస్తుంది. ప్రధాన ప్రాజెక్టుల్లో దాదాపు రూ.10,150 కోట్ల వ్యయంతో కసారా-మన్మాడ్ 3వ, 4వ లైన్లు (131 కి.మీ.), రూ.8,740 కోట్ల కన్నా ఎక్కువ ఖర్చుతో కూడిన ఖర్సియా-నయా రాయ్‌పూర్-పర్మల్‌కసా 5వ, 6వ లైన్లు (278 కి.మీ.) తో పాటు రూ.5,450 కోట్లకు పైగా ఖర్చు అయ్యే ఇటార్సీ-నాగ్‌పూర్ 4వ లైను (297 కి.మీ.)తో పాటు రూ.5,000 కోట్ల కు మించిన ఖర్చుతో కూడిన సికందరాబాద్ (సనత్‌నగర్)-వాడీ 3వ, 4వ లైన్లు (173 కి.మీ.) భాగంగా ఉన్నాయి. ఇవన్నీ కలిపితే, ఒక్క ఈ ప్రాజెక్టులకే రూ.28,000 కోట్లు ఖర్చవుతుంది. అధిక రద్దీతో కూడిన ట్రంక్ రూట్లను పటిష్ఠపరచడానికి రైల్వేలు ఎంతగా శ్రద్ధ వహిస్తోందీ ఈ ప్రాజెక్టులు తెలియజేస్తున్నాయి.

ఈ ప్రాజెక్టులు 'మిషన్ 3000 ఎంటీ' కార్యక్రమంతో వ్యూహాత్మకంగా ముడిపడి ఉన్నాయి. సరకు రవాణా సామర్థ్యంలో గణనీయ వృద్ధిని సాధించడం వీటి లక్ష్యం. పోర్ట్‌ఫోలియోలో ఇంధన నడవా (ఎనర్జీ కారిడార్) ప్రాజెక్టులది పైచేయిగా ఉంది. ఇవి బొగ్గు, ఖనిజాల సత్వర రాకపోకలకు వీలు కల్పిస్తాయి. అంతేకాక, ఇంధన భద్రతను పటిష్ఠపరుస్తాయి. కీలక మార్గాల్లో రద్దీని హై డెన్సిటీ నెట్‌వర్క్ ప్రాజెక్టులు తగ్గిస్తాయి. మరో వైపు, 'రైల్ సాగర్ కారిడార్'తో ఓడరేవుల అనుసంధానంతో పాటు కోస్తా వాణిజ్యంలో మెరుగుదల సాధ్యపడుతుంది. ఇవన్నీ కలిపితే, ఈ కార్యక్రమం మొత్తంమీద నెట్‌వర్క్ సామర్థ్యాన్నీ, ఆధునిక రవాణా వ్యవస్థ పనితీరును మెరుగుపరచడం ఖాయం.

ఇంత భారీ స్థాయిలో పెట్టుబడి పెట్టడంతో ఉపాధి అవకాశాలు అందివస్తాయి. ఉక్కు, సిమెంటు వంటి ప్రధాన రంగాల్లో డిమాండు పెరుగుతుంది. దేశమంతటా ఆధునిక రవాణా వ్యవస్థ ఖర్చులు తగ్గుతాయన్న అంచనాలున్నాయి. ఈ ప్రాజెక్టులు పురోగమించే కొద్దీ, రైల్వే సామర్థ్యం పెరుగుతుంది. సేవల అందజేత మెరుగవుతుంది. ఈ ప్రాజెక్టులు భారత ఆర్థికాభివృద్ధికి ఒక ఉత్ప్రేరకంలా పనిచేస్తాయి. ఇది ఏదో మామూలు ప్రగతి కాదు.. భారత్ తదుపరి ఆర్థిక ముందంజ ప్రక్రియ సాఫీ గా సాగిపోయేందుకు పట్టాలను ఈ ప్రాజెక్టులు నిర్మిస్తున్నాయన్న సంగతి స్పష్టమవుతున్నది.

# అంబేద్కర్ ఆశయాలు, ఆలోచనలు మార్గదర్శకం

### -కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

అమరావతి, ఏప్రిల్ 14:విజయవాడ చిట్టినగర్‌లోని మిల్క్ ఫ్యాక్టరీ ఆవరణలో భారత రాజ్యాంగ రూప శిల్పి, భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడినవి. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నిర్దేశించిన మార్గం సమాజానికి దిశానిర్దేశకమని, ఆయన ఆలోచనలు, ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే కృష్ణా మిల్క్ యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కొల్లి ఈశ్వర బాబు మాట్లాడుతూ రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్ సేవలు అపారమని, ఆయన చూపిన మార్గంలో నడవడం ద్వారా సమానత్వ సమాజ నిర్మాణం సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధికారు లు, రిటైర్డ్ ఉద్యోగి జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదాల నివారణకు అప్రమత్తత అవసరం

### -ఎమ్మెల్యే గొండు శంకర్
### -శ్రీకాకుళంలో అగ్నిమాపక వారోత్సవాలు




శ్రీకాకుళం, ఏప్రిల్ 14: అగ్నిమాపక వారోత్సవాల భాగంగా మంగళవారం శ్రీకాకుళం ఏడు రోడ్ల సమీపంలోని అగ్నిమాపక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమాన్ని స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాల సమయంలో చేపట్టే రక్షణ చర్యలను ప్రదర్శిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అగ్నిప్రమాదాలు నివారించడానికి ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరమన్నారు.

గృహాలలో గ్యాస్ సిలిండర్లు, విద్యుత్ పరికరాలను సురక్షితంగా వినియోగించాలని సూచించారు. నిర్లక్ష్యం వల్ల చిన్న ఘటనలు పెద్ద ప్రమాదాలుగా మారే అవకాశముందని హెచ్చరించారు.

అగ్నిమాపక సిబ్బంది సమయానికి స్పందించి అనేక ప్రాణాలను కాపాడుతున్నారని, వారి సేవలు ప్రశంసనీయమని అన్నారు. ప్రజలు కూడా అత్యవసర సమయంలో అగ్నిమాపక శాఖకు సహకరించాలని కోరారు.

అగ్నిమాపక వారోత్సవాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యమని తెలియచేస్తూ.. ప్రతి ఒక్కరూ అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే పిలువునిచ్చారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# భారత ప్రజాస్వామ్య వ్యవస్థ పురోగతికి పార్లమెంటులో మహిళల పాత్ర కీలకం: డాక్టర్ మాండవీయ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:'నారీ శక్తి: వికసిత్ భారత్ కీ ఆవాజ్-సమ్మిళిత ప్రజాస్వామ్య బలోపేతం' ఇతివృత్తంతో ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన శ్రీరామ్ కామర్స్ కాలేజీలో యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని మేరా యువ భారత్ (మై భారత్), మహిళా యువ పార్లమెంటును విజయవంతంగా నిర్వహించింది. వందేమాతరం గీతాలాపనతో ప్రారంభమైన ఈ కార్యక్రమం దేశభక్తితో, స్ఫూర్తిదాయకంగా కొనసాగింది.

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, కార్మిక ఉపాధి శాఖ కేంద్రమంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటులో మహిళల నిర్మాణాత్మక పాత్రను కొనియాడారు. రాష్ట్రపతి వంటి అత్యున్నత పదవుల వరకూ ఎదిగేలా భారత ప్రజాస్వామ్యం మహిళలను శక్తిమంతంగా మార్చిందని స్పష్టం చేశారు. సమ్మిళిత పరిపాలన దేశ పురోగతిని మరింత బలోపేతం చేస్తుందన్నారు. నారీ శక్తి అధినియంపై ఏప్రిల్ 16 నుంచి 18 వరకు జరగనున్న ప్రత్యేక సమావేశాన్ని ప్రస్తావిస్తూ.. శాసనసభల్లో మహిళలకు అధిక ప్రాతినిధ్యం కల్పించటంలోని చారిత్రక ప్రాముఖ్యతను వివరించారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా సమగ్ర, అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణానికి ఇది కీలక అడుగని తెలిపారు.

ఢిల్లీ శాసనసభ స్పీకర్ శ్రీ విజేందర్ గుప్తా ప్రసంగిస్తూ.. "దేశ నిర్మాణానికి మహిళలే పునాది. రాజకీయాల్లో వారి భాగస్వామ్యం వల్ల విధానాలు మరింత సున్నితంగా, సమ్మిళితంగా, ప్రభావవంతంగా రూపొందుతాయి. నిర్ణయాధికారంలో మహిళల పాత్ర కీలకమైనది. సాధికారత సాధించిన మహిళలు సమాజంలో సమతుల్యత, న్యాయం, పురోగతిని కల్పిస్తూ.. అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మిస్తారు" అని పేర్కొన్నారు.

మహిళా సాధికారత, నారీ శక్తి స్ఫూర్తిని బలోపేతం చేయాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వ నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుంది. మహిళల అభిప్రాయాలను వ్యక్తపరచటానికి, ప్రజాస్వామ్య ప్రక్రియలను అర్థం చేసుకోవటానికి, విధాన రూపకల్పనలో క్రియాశీలకంగా పాల్గొనేందుకు అత్యుత్తమ వేదికను అందించటవే ఈ మహిళా యువ పార్లమెంట్ ఉద్దేశం.

ఈ కార్యక్రమంలో 500 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. వీరిలో ఢిల్లీ, ఉత్తరాఖండ్‌కు చెందిన 37 మంది యువ ప్రతినిధులు వివిధ మంత్రిత్వ శాఖల తరపున హాజరై, మాక్ యూత్ పార్లమెంటులో ఉత్సాహంగా పాల్గొన్నారు. వారు "నారీ శక్తి వందన్ అధినియం"పై అభిప్రాయాలను వ్యక్తపరుస్తూ.. మహిళల భాగస్వామ్యం, నాయకత్వం, సమగ్ర పాలన ప్రాముఖ్యతను స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ నితేష్ కుమార్ మిశ్రా, మై భారత్ సీఈఓ డాక్టర్ ప్రియాంకా శుక్లా, శ్రీరామ్ కామర్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిమ్రిత్ కౌర్ వంటి ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు పార్లమెంటరీ కార్యకలాపాలను అనుకరిస్తూ అభిప్రాయాలను సమర్థవంతంగా వ్యక్తం చేశారు. పాలనలో మహిళల ప్రాతినిధ్యానికి సమష్టిగా మద్దతు పలికారు. యువతుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, వాక్చాతుర్యం, పౌర బాధ్యతను పెంపొందించడటానికి ఈ కార్యక్రమం ఎంతగానో సహకరించింది.

కార్యక్రమం ముగింపు సందర్భంగా డాక్టర్ ప్రియాంకా శుక్లా ధన్యవాదాలు తెలియజేశారు. గౌరవనీయులైన అతిథులు, ప్రతినిధులు, మాక్ యూత్ పార్లమెంట్ విజయవంతమయ్యేందుకు సహకరించిన మహిళలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

వికసిత భారత్ నిర్మాణంలో మహిళల కీలకమైన, నిర్ణయాత్మకమైన పాత్రను స్పష్టం చేస్తూ.. వారి గళాన్ని వినిపించేందుకు గొప్ప వేదికగా ఈ కార్యక్రమం నిలిచింది.

# విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి : పద్మా దేవేందర్ రెడ్డి



మెదక్, ఏప్రిల్ 14:విద్యుత్ ఆర్టిజెన్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మెదక్ జిల్లాలో గత 7 రోజులుగా కొనసాగుతున్న ఆర్టిజన్ కార్మికుల సమ్మెలో పాల్గొని కార్మికులకు బీఆర్‌ఎస్ పార్టీ తరఫున మద్దతు ప్రకటించారు.

ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, విద్యుత్ కార్మికుల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని అన్నారు. ఇప్పటికే వారం రోజులుగా సమ్మె కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. కార్మికులు ఏపీఎస్‌ఈబీ నిబంధనలను యథాతథంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే కార్మికులతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని, లేని పక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ తరఫున కార్మికులకు అండగా నిలిచి పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

రాష్ట్రానికి విద్యుత్ రంగం కీలకమని పేర్కొంటూ, విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్క వెంటనే స్పందించి కార్మికులను చర్చలకు ఆహ్వానించాలని కోరారు.

రాష్ట్రంలో ప్రస్తుత పాలనపై విమర్శలు గుప్పించిన ఆమె, విద్యుత్ కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల పక్షాన బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడూ నిలుస్తుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మామిళ్ల ఆంజనేయులు, న్యాయవాది జీవన్ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు దీపక్ కుమార్, జుబెర్ అహ్మద్, ఉదయ్ కుమార్,మెదక్ మండల పార్టీ అధ్యక్షులు అంజ గౌడ్, నాయకులు పూసల సంతోష్ సునీల్, ఇంతియాజ్ మోహన్, మహిళా నాయకురాలు చంద్రకళ, రాధ , విద్యుత్ కార్మికులు నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి

ఖమ్మం, ఏప్రిల్ 14: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామ శివారు ప్రాంతంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భద్రాచలం ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏన్కూర్ మండలం జన్నారం గ్రామానికి చెందిన వెంగళరావు రామవరంలో నివాసం ఉంటున్నాడు. భద్రాచలం ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా ఉద్యోగం చేస్తున్నారు. డ్యూటీకి వెళ్తున్న క్రమంలో అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం అతను ప్రయాణిస్తున్న బైకును ఢీ కొట్టి ఆగకుండా వెళ్ళిపోయింది. ఈ ఘటనలో వెంగలరావు(48) తీవ్ర గాయాలకు గురయ్యారు.

స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించగా, ఈఎంటీ జ్యోతి, పైలెట్ విజయ్ భాస్కర్ సంఘటనా స్థలానికి చేరుకొని బాధితునికి ప్రాథమిక చికిత్స అందించి భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యం పొందుతూ వెంగళరావు మృతి చెందాడు. మృతుడు వెంగళరావుకి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బూర్గంపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు భద్రత చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలి.. ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని వేగ నియంత్రణ పాటించడం, జాగ్రత్తగా వాహనాలు నడపడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించ వచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నప్పటికీ కొంతమంది నిర్లక్ష్యం వీడకుండా వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని రోడ్డు భద్రత నియమాలు తప్పకుండా పాటించి తీరాలని అన్నారు. అదేవిధంగా ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా అధికారులు రోడ్డు భద్రత చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# రోడ్డు భద్రత..అందరి బాధ్యత

### -అలైవ్... అరేయ్ కార్యక్రమంలో
### -కె. యూ ఎస్సై విజయ్ కుమార్

నల్గొండ, ఏప్రిల్ 14:పభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా భీమారం జంక్షన్ లో పోలీస్ ఉన్నతాధికారుల, సి.ఐ. ఎస్. రవి కుమార్ ఆదేశాల మేరకు కేయూ ఎస్ఐ విజయ్ కుమార్ అరైవ్ - అలైవ్ నినాదంతో న కార్యక్రమం న్ని నిర్మించారు. ముందుగా ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

# విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి




నల్గొండ, ఏప్రిల్ 14:విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ తెలిపారు. పట్టణంలోని మల్లికార్జున ఒలంపియాడ్ స్కూల్ లో మంగళవారం గ్రాడ్యువేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పావని రమేష్ గౌడ్ చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నేటి బాలలే రేపటి బావి భారతం పౌరులని, చిన్నతనం నుండే పట్టుదలతో కృషి చేస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అందుకుంటారని, చిన్నపిల్లలకు క్రమశిక్షణ, ఉన్నత విలువలతో కూడిన విద్యని అందించడం ద్వారా సమాజంలో ఉన్నత పదవులలో ఉండి సమాజానికి సేవ చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, ఎంఈఓ గురువారావు, మల్లికార్జున హైస్కూల్ చైర్మన్ మారపల్లి మల్లారెడ్డి, డైరెక్టర్లు భీమిడి ధరణి, మారెపల్లి తేజస్విని, ప్రిన్సిపాల్ కన్నయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దార్శనికతతో అణగారిన వర్గాలకు సమానత్వ హక్కులు : నెమ్మది శ్రావణ్ కుమార్

హైదరాబాద్, ఏప్రిల్ 14:డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని బడా గణేష్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమాలకు బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకుడు నెమ్మది శ్రావణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.

ఈ సందర్భంగా నెమ్మది శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాలకు రాజ్యాంగంతో సమానత్వ హక్కులను ప్రసాదించిన గొప్ప దార్శనికులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. సమాజంలో 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కును కల్పిస్తూ పాలకుల ఎన్నిక, ప్రభుత్వాల ఏర్పాటులో దేశ పౌరులను భాగస్వామ్యం చేస్తూ ఇచ్చిన ఓటు అనే హక్కును అందించింది అంబేద్కర్ రచించిన రాజ్యాంగంతోనే అని అన్నారు.

# మాదాసి కుర్వలకు ప్రభుత్వం ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలి..



ఆదిలాబాద్, ఏప్రిల్ 14: ప్రభుత్వం మాదాసి కుర్వ కులస్తులకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని అమీన్ పూర్ మాదాసి కుర్వ సంఘం అధ్యక్షులు చిన్న అయ్యలప్ప విజ్ఞప్తి చేశారు. మంగళవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని అమీన్ పూర్ లో అంబేద్కర్ 135వ జయంతి పురస్కరించుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించితమకు ఎస్సీ కుల ధ్రువీకరణపత్రాలు ఇప్పించేవిధంగాచూడాలనివిజ్ఞప్తిచేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదాసి కుర్వ కులస్తులు రాత్రి పగలు తేడా లేకుండా గొర్రెలు మేకలు కాస్తూ రాత్రి పగలు తేడా లేకుండా అడవిలో జీవనం కొనసాగిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం తమకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో తమకు సర్టిఫికెట్లు ఇచ్చేవరకు పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సర్పంచ్ టప్ప నాగేష్, మాదాసి కుర్వ సంఘంఉపాధ్యాయుడు డి నరసప్ప, జి సిద్ధప్ప, రమేష్, కే నర్సప్ప, జి చిన్న నరసప్ప, నరసప్ప, తదితరులు పాల్గొన్నారు.

# సమసమాజ దిశగా అంబేద్కర్ మార్గం..

భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.నల్లబెల్లి బస్స్టాండ్ ఆవరణతో పాటు నారక్కపేట జాతీయ రహదారి?365పై ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు,ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బానోతు సారంగపాణి నాయకత్వం వహించారు. అనంతరం నల్లబెల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నాగెల్లి జ్యోతి ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సారంగపాణి మాట్లాడు తూ,అంబేద్కర్ సమసమాజ నిర్మాణానికి కృషి చేసిన మహానుభావుడని కొనియాడారు.ఆయన ఆలోచనలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు,దళితుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ముఖ్యంగా అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు,ఇదే సందర్భంగా నారక్కపేట గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటి ట్యాంకర్ వాహనాన్ని సర్పంచ్ దండెం సంపత్‌తో కలిసి ప్రారంభించారు,

# మహిళా ప్రాతినిధ్యంపై దేశవ్యాప్త తీర్మానం 17 జోన్లలో ఆమోదం..
# సమగ్ర ప్రజాస్వామ్యం, దేశాభివృద్ధి దిశగా ముందడుగు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: దేశవ్యాప్తంగా ఏప్రిల్ 12, 2026న నారీ శక్తి యూత్ పార్లమెంట్‌ను కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ (మై భారత్) వేదిక ద్వారా విజయవంతంగా నిర్వహించింది. మై భారత్ బడ్జెట్ క్వెస్ట్-2026 గ్రాండ్ ఫినాలేకు ముందుగా ఈ కార్యక్రమం జరిగింది. 'నారీ శక్తి: వికసిత్ భారత్ కీ ఆవాజ్-సమ్మిళిత ప్రజాస్వామ్య బలోపేతం' అనే ఇతివృత్తంతో దేశవ్యాప్తంగా 17 జోన్లలో ఒకే సమయంలో ఈ కార్యక్రమం జరిగింది. వ్యవస్థీకృత ప్రజాస్వామ్య భాగస్వామ్యం, యువత నేతృత్వంలోని విధానపరమైన చర్చల్లో భాగంగా 7,000 మందికి పైగా యువతులు ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో పాల్గొన్నారు.

విధానపరమైన నిర్ణయాల్లో యువ శక్తికి ప్రాధాన్యతనివ్వాలనే ప్రభుత్వ నిబద్ధతను ఈ విస్తృత స్థాయి జాతీయ భాగస్వామ్యం ప్రతిబింబిస్తుంది. కేంద్ర బడ్జెట్-2026లోని పలు ఆలోచనలు.. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీబీవైఎల్‌డీ)-2026లో జరిగిన చర్చల నుంచి స్ఫూర్తి పొందినవే. జాతీయ ప్రాధాన్యతలను రూపొందించటంలో యువతతో జరిగిన సంప్రదింపుల నిర్మాణాత్మక పాత్రను ఇది మరింత బలోపేతం చేస్తుంది.

దేశవ్యాప్తంగా ముంబయి (మహారాష్ట్ర), అమరావతి (ఆంధ్రప్రదేశ్), బెంగళూరు (కర్ణాటక), భోపాల్ (మధ్యప్రదేశ్), రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్), భువనేశ్వర్ (ఒడిశా), హిసార్ (హర్యానా), ఢిల్లీ, చండీగఢ్, షిల్లాంగ్ (ఈశాన్య ప్రాంతం), అహ్మదాబాద్ (గుజరాత్), హైదరాబాద్ (తెలంగాణ), జైపూర్ (రాజస్థాన్), రాంచీ (జార్ఖండ్), లక్నో (ఉత్తరప్రదేశ్), పాట్నా (బీహార్), శ్రీనగర్ (జమ్మూ, కాశ్మీర్)లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇది కార్యక్రమ విస్తృతిని, వైవిధ్యాన్ని, సమ్మిళిత స్వభావాన్ని ప్రతిబింబిస్తుంది.

విద్యా, సామాజిక, ప్రాంతం వంటి విభిన్న నేపథ్యాల నుంచి యువతులు పాల్గొనటం ద్వారా భారత ప్రజాస్వామ్య, అభివృద్ధి ప్రయాణంలోని కీలక అంశాలపై చర్చించేందుకు ఈ నారీ శక్తి యూత్ పార్లమెంట్ విశ్వసనీయ, వ్యవస్థీకృత వేదికగా నిలిచింది. అన్ని జోన్లలో పాల్గొన్నవారంతా సంప్రదింపులు, పార్లమెంటరీ తరహా చర్చలు నిర్వహించి ప్రజాస్వామ్య విలువలు, విజ్ఞానాత్మక సంభాషణలు, జనభాగీదారీ పట్ల నిబద్ధతను తెలియజేశారు.

చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యాన్ని బలోపేతం చేయటంపై జరిగిన చర్చలు కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మొత్తం 17 జోన్లలో జరిగిన ఈ కార్యక్రమాలు అధికారిక తీర్మానాన్ని ఆమోదించటంతో ముగిశాయి. రాజ్యాంగ (సవరణ) బిల్లు-2026కు ఏకగ్రీవ మద్దతు లభించింది. ఈ బిల్లు ప్రకారం.. లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 నుంచి 816కు పెంచటంతో పాటు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించాలని ప్రతిపాదించారు. 2029 సార్వత్రిక ఎన్నికల నుంచి నారీ శక్తి వందన్ అధినియం-2023ని సకాలంలో అమలు చేయటాన్ని ఈ తీర్మానం సమర్థిస్తోంది. మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని తక్షణమే, సమర్థవంతంగా సాకారం చేయటానికి, అమలును నియోజకవర్గాల పునర్విభజన పరిమితుల నుంచి వేరు చేయాల్సిన అవసరాన్ని ఈ తీర్మానం స్పష్టం చేస్తోంది. తద్వారా సమ్మిళిత, భాగస్వామ్య ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చేస్తుంది.

వివిధ జోన్లలో జరిగిన ఈ కార్యక్రమాలకు విశిష్ట అతిథులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. భారత అభివృద్ధి ప్రయాణంలో నాయకులు, నిర్ణేతలుగా పెరుగుతున్న నారీ శక్తి పాత్రను తెలియజేశారు. యువతుల అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తపరచటానికి, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవటానికి, దేశవ్యాప్త చర్చల్లో అర్థవంతమైన భాగస్వామ్యాన్ని అందించటానికి శక్తిమంతమైన వేదికగా యూత్ పార్లమెంట్ నిలిచింది.

విధానపరమైన చర్చలకు అనుబంధంగా దేశవ్యాప్తంగా ఏకకాలంలో పలు ప్రాంతాల్లో మంత్రిత్వ శాఖ నిర్వహించిన 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ స్పృహ, శారీరక దృఢత్వం, సుస్థిర జీవనశైలిని ప్రోత్సహించటం ద్వారా 'స్వచ్ఛ, వికసిత్ భారత్' నిర్మాణంలో ఉమ్మడి నిబద్ధతను ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఒకే సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలు యువతను ఒకచోట చేర్చి సమగ్ర నమూనాను ఆవిష్కరించాయి. ఇందులో యువతులు నిర్మాణాత్మక విధానపరమైన చర్చలకు నాయకత్వం వహించగా, సాధారణ యువత సామాజిక మార్పునకు మద్దతిస్తూ.. భాగస్వామ్య, సమ్మిళిత దేశ నిర్మాణ దృక్పథాన్ని సమష్టిగా ముందుకు నడిపించారు.

దేశవ్యాప్తంగా 17 జోన్లలో ఈ భారీ స్థాయి కార్యక్రమాన్ని ఒకే సమయంలో విజయవంతంగా నిర్వహించటం.. యువతను పెద్దఎత్తున ఒకచోట చేర్చి, జాతీయ ప్రాధాన్యతలను క్షేత్రస్థాయి భాగస్వామ్యంగా మార్చటంలోనూ మై భారత్ సంస్థాగత సామర్థ్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. వికసిత్ భారత్ ఏ2047 లక్ష్యం దిశగా భారత్ పయనిస్తున్న తరుణంలో కొత్త తరం ఆవిర్భావాన్ని నారీ శక్తి యువ పార్లమెంట్ స్పష్టం చేస్తోంది. అవగాహన, స్పష్టమైన వ్యక్తీకరణ, కార్యాచరణ కలిగిన ఈతరం నారీ శక్తి కేవలం పాలనలో భాగం పంచుకోవటమే కాక, దేశ భవిష్యత్తును క్రియాశీలకంగా తీర్చిదిద్దుతోంది.




## ఢిల్లీ, డెహ్రాడూన్ మధ్య ప్రయాణ కాలాన్ని 6 గంటల నుంచి సుమారు 2.5 గంటలకు తగ్గించనున్న కారిడార్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2026 ఏప్రిల్ 14న ఉత్తరాఖండలోను, ఉత్తరప్రదేశ్‌లోను పర్యటించనున్నారు. ఉదయం సుమారు 11:15 గంటలకు ప్రధాని ఉత్తరప్రదేశ్‌లోని సహారన్‌పూర్ చేరుకొంటారు. ఢిల్లీ-డెహ్రాడూన్ ఆర్థిక కారిడార్ లో ఉన్నత భాగమైన వైల్డ్‌లైఫ్ కారిడార్ గురించి ప్రధానమంత్రి సమీక్షిస్తారు. ఉదయం దాదాపు 11:40 గంటలకు ప్రధాని డెహ్రాడూన్ సమీపంలో జై మా దాత్ కాళీ ఆలయాన్ని దర్శించుకొని, పూజ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తరువాత, ఇంచుమించు మధ్యాహ్నం 12:30 గంటలకు ప్రధానమంత్రి డెహ్రాడూన్‌లో ఒక జనసభలో పాల్గొని, ఢిల్లీ-డెహ్రాడూన్ ఆర్థిక కారిడార్ ను ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు.

ఢిల్లీ-డెహ్రాడూన్ ఆర్థిక కారిడార్ పొడవు 213 కిలోమీటర్లు. దీనిలో ఆరు దోవలు ఉన్నాయి. దీని నిర్మాణానికి రూ.12,000 కోట్ల కన్నా ఎక్కువ ఖర్చు చేశారు. ఇది ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల గుండా సాగుతుంది. దీనితో ఢిల్లీకీ, డెహ్రాడూన్‌కూ మధ్య ప్రయాణానికి ప్రస్తుతం పడుతున్న ఆరు గంటలకు పైచిలుకు కాలం కాస్తా సుమారు రెండున్నర గంటలకు తగ్గుతుంది.

ఈ ప్రాజెక్టులో భాగంగా 10 ఇంటర్‌చేంజుల్నీ, 3 రైల్వే ఓవర్ బ్రిడ్జుల్నీ (ఆర్ఓబీస్), 4 ప్రధాన వంతెనలతో పాటు 12 పక్కదారి సదుపాయాల్నీ నిర్మించి, నిరంతరాయంగా అధిక వేగవంతమైన అనుసంధానానికి మార్గాన్ని సుగమం చేశారు. ఈ కారిడార్‌ను ఉపయోగించుకొనే వారికి సురక్షిత, మరింత ఎక్కువ సమర్థమైన ప్రయాణానుభవాన్ని అందించడం కోసం ఆధునిక ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థ (ఏటీఎంఎస్)ను జతపరిచారు.

# అవకాశాలను విస్తరిస్తూ, వారిని మరింతగా సాధికారులను చేసే దిశగా మనమంతా ముందుకు రావాలి: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: విజ్ఞాన్ భవన్‌లో ఈ రోజు నిర్వహించిన నారీశక్తి వందన్ కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. బైశాఖీ శుభసందర్భంగా, దేశంలోని చాలాచోట్ల నూతన సంవత్సర వేడుకలను చేసుకోనున్న తరుణంలో ఆయన మాట్లాడారు. జలియన్‌వాలా బాగ్ మారణకాండ అమరులకు ప్రధానమంత్రి నివాళి అర్పించారు. "నారీ శక్తిపై భారత్ కృతనిశ్చయంతో ఉంది. 21వ శతాబ్దంలో అత్యంత కీలక నిర్ణయాల్లో ఇదొకటి" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ఇది చరిత్రాత్మక సందర్భమన్న ప్రధానమంత్రి.. గతకాలపు ఆకాంక్షలను, భవిష్యత్ సంకల్పాలను నెరవేర్చేలా దేశ పార్లమెంటు కొత్త చరిత్రను లిఖించబోతోందన్నారు. సామాజిక న్యాయం ఆవశ్యకతను ఆయన వివరించారు. సామాజిక న్యాయమన్నది నినాదంగానే మిగిలిపోకుండా, మన పని సంస్కృతిలో అంతర్భాగంగా ఉండే సమసమాజ భారతాన్ని దేశం ఆకాంక్షిస్తోందని ఆయన స్పష్టం చేశారు. "రాష్ట్రాల శాసనసభల నుంచి దేశ పార్లమెంటు వరకు.. దశాబ్దాల నిరీక్షణ ఇక ముగియబోతోంది" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

2023లో పార్లమెంటు కొత్త భవనంలో నారీ శక్తి వందన్ చట్టం ఆమోదాన్ని ప్రధానమంత్రి గుర్తు చేసుకున్నారు. ఏదేమైనా 2029 నాటికి ఈ చట్టాన్ని అమలు చేసేందుకు అన్ని పార్టీలు అంగీకరించడంతో, ఏకగ్రీవంగా ఆమోదం పొందిన విషయాన్ని ప్రస్తావించారు. మహిళల భాగస్వామ్యం ద్వారా మన ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేలా.. 'నారీ శక్తి వందన్' చట్టాన్ని సకాలంలో అమలు చేయాలని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. అందుకోసం ఏప్రిల్ 16 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రత్యేక సెషన్ ప్రారంభమవుతుందని శ్రీ మోదీ వెల్లడించారు. "చర్చలు, సహకారం, భాగస్వామ్యం ద్వారా ఈ పని పూర్తి కావాలన్నదే మా ప్రయత్నం, దానికే మా ప్రాధాన్యం. పార్లమెంటు గౌరవాన్ని ఇది మరింత పెంచుతుంది" అని శ్రీ నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు.

ఈ అంశంపై దేశవ్యాప్తంగా మహిళల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయన్నారు. అసెంబ్లీలకు, లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించాలన్న తమ ఆకాంక్షలను మహిళలు బలంగా వినిపిస్తున్నారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. వారి కలలకు కొత్త రెక్కలొచ్చాయని, దేశంలో ఒక సానుకూల వాతావరణం ఏర్పడిందని వ్యాఖ్యానించారు. "ఈ మొత్తం ప్రక్రియలో మహిళలంతా క్రియాశీలురుగా భాగస్వామ్యం వహించాలి. తమ ఎంపీలను కలిసి అభిప్రాయాలను, అంచనాలను పంచుకోవాలని విన్నవిస్తున్నాను" అని ప్రధానమంత్రి కోరారు.

స్వాతంత్ర్య పోరాటం నుంచి రాజ్యాంగ పరిషత్తు వరకు మహిళల సేవలను గుర్తుచేస్తూ.. స్వతంత్ర భారత నిర్మాణానికి పునాది వేయడంలో నారీశక్తి అత్యంత కీలక పాత్ర పోషించిందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ప్రాతినిధ్యావకాశాన్ని పొందిన మహిళలు దేశం కోసం అద్భుతంగా కృషి చేశారని కొనియాడారు. నేడు కూడా మన దేశంలో రాష్ట్రపతి నుంచి ఆర్థిక మంత్రి వరకు మహిళలు కీలక బాధ్యతల్లో ఉన్నారని ఆయన గుర్తుచేశారు. "రాష్ట్రపతి నుంచి ప్రధానమంత్రి వరకు.. ఏ పదవిలో ఉన్నా తమకంటూ ఒక ప్రత్యేక పరంపరను మహిళలు సృష్టించుకున్నారు" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

పంచాయతీరాజ్ సంస్థలు మహిళా నాయకత్వానికి అద్భుతమైన ఉదాహరణగా ప్రధానమంత్రి పేర్కొన్నారు. నేడు దేశవ్యాప్తంగా స్థానిక ప్రభుత్వ సంస్థల్లో 14 లక్షలకు పైగా మహిళలు విజయవంతంగా పనిచేస్తున్నారని ఆయన వివరించారు. దాదాపు 21 రాష్ట్రాల్లో.. పంచాయతీల్లో మహిళల భాగస్వామ్యం దాదాపు 50 శాతానికి చేరిందని తెలిపారు. "రాజకీయ, సామాజిక రంగాల్లో లక్షలాది మహిళల ఈ క్రియాశీల భాగస్వామ్యం.. ప్రపంచంలోని అగ్రదేశాల నేతలను, రాజకీయ నిపుణులను కూడా ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇది దేశ కీర్తి ప్రతిష్ఠలను మరింత పెంచు తోంది" అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు.

వివిధ అధ్యయనాలను ఉదహరిస్తూ... నిర్ణయాధికార ప్రక్రియల్లో మహిళల భాగస్వామ్యం పెరిగితే, అది వ్యవస్థల్లో సున్నితత్వాన్ని తీసుకొస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. దీనివల్ల నీరు, విద్య, ఆరోగ్యం, పోషకాహారం వంటి కీలక అంశాలపై మరింత అంకిత భావంతో పనిచేసే వాతావరణం ఏర్పడిందన్నారు. "జల్ జీవన్ మిషన్ సాధించిన విజయమే దీనికి నిదర్శనం. పంచాయతీ స్థాయిలో మహిళల భాగస్వామ్యం ఇందులో కీలక పాత్ర పోషించింది" అని శ్రీ మోదీ అన్నారు.

స్థానిక సంస్థలు, వివిధ వ్యవస్థల్లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న లక్షలాది మహిళలకు ఇప్పుడు అపారమైన అనుభవం ఉందన్న ప్రధానమంత్రి.. మరింత పెద్ద బాధ్యతలను చేపట్టేందుకు వారు సిద్ధంగా, ఉత్సాహంగా ఉన్నారన్నారు. నారీ శక్తి వందన్ చట్టం అమలు అలాంటి మహిళలందరి జీవితాల్లో ఒక గొప్ప అవకాశంగా నిలుస్తుందని తెలిపారు. "పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు ప్రయాణం ఇకపై మరింత సులభతరం కాబోతోంది" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

వికసిత భారత ప్రస్థానంలో మహిళల పాత్ర అత్యంత కీలకమని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. మహిళల జీవితంలోని ప్రతి దశకూ తగిన పథకాలను 2014 నుంచి తమ ప్రభుత్వం రూపొందించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పుట్టిన నాటి నుంచి తుది శ్వాస వరకు.. వివిధ పథకాలతో అక్కాచెల్లెళ్లు, ఆడబిడ్డలకు సేవలందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. "భ్రూణ హత్యలను నివారించడం కోసం బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమాన్ని ప్రారంభించాం. గర్భిణులకు సరైన పోషకాహారం అందేలా మాతృ వందన యోజన కింద రూ. 5,000 ఆర్థికసాయాన్ని అందిస్తున్నాం. అలాగే ఆడబిడ్డల విద్యకు అండగా నిలవడం లక్ష్యంగా.. అత్యధిక వడ్డీతో సుకన్య సమృద్ధి యోజనను ప్రారంభించాం" అని ప్రధానమంత్రి వివరించారు.

మహిళల కోసం ఏర్పాటు చేసిన సమగ్ర సహాయక వ్యవస్థను వివరిస్తూ.. సకాలంలో టీకాలు వేయించడం కోసం మిషన్ ఇంద్రధనుష్, స్వచ్ఛ భారత్ అభియాన్ కింద టాయిలెట్ల నిర్మాణం, దాదాపు ఉచితంగా శానిటరీ నాప్కిన్లు, ఖేలో ఇండియా పథకం ద్వారా ఆర్థిక ప్రోత్సాహాలను ప్రధానమంత్రి ప్రస్తావించారు. అంతేకాకుండా సైనిక పాఠశాలలు, నేషనల్ డిఫెన్స్ అకాడమీలో కూడా ఆడబిడ్డలకు ప్రవేశాన్ని కల్పించామని గుర్తుచేశారు. జీవితంలో తర్వాతి దశలకు సంబంధించి... ఉజ్వల యోజన ద్వారా కోట్ల సంఖ్యలో గ్యాస్ కనెక్షన్లు, హర్ ఘర్ నల్ సే జల్ ద్వారా ఇంటింటికీ తాగునీరు, ఉచిత రేషన్ పథకం ద్వారా ఆహార భద్రత, ఆయుష్మాన్ యోజన కింద రూ. 5 లక్షల వరకు ఆరోగ్య బీమాను అందిస్తున్నామని తెలిపారు. "ఔషధాలపై 80 శాతం వరకు రాయితీనిచ్చే జన్ ఔషధి కేంద్రాలు సహా.. ఈ కార్యక్రమాలన్నీ ముఖ్యంగా మన అక్కాచెల్లెళ్లు, ఆడబిడ్డలకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చాయి" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

మహిళల సాధికారత పెరగాలంటే ఆర్థిక భాగస్వామ్యం పెరగడం అత్యావశ్యకమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వ ప్రతి నిర్ణయం, ప్రతీ పథకం ఈ అంశానికి ప్రాధాన్యమిచ్చిందన్నారు. గతంలో కుటుంబ ఆస్తులు ప్రధానంగా పురుషుల పేరుమీదే నమోదయ్యేవన్నారు. అయితే ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ప్రాధాన్యక్రమంలో మహిళల పేరు మీదనే ఇళ్లను నమోదు చేస్తున్నామని తెలిపారు. "గడిచిన 11 ఏళ్లలో ఈ నిర్ణయం ద్వారా 3 కోట్లకు పైగా మహిళలకు లబ్ధి చేకూరింది. గృహాలకు వారు యజమానులయ్యారు. ఇది వారిని ఆర్థికంగా బలోపేతం చేసింది" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ఆర్థిక సమ్మిళితత్వం గురించి ప్రస్తావిస్తూ... 2014 నాటికి దేశంలో కోట్ల మంది మహిళలు కనీసం బ్యాంకు గడప తొక్కి ఉండరని ప్రధానమంత్రి గుర్తుచేశారు. జన్‌ధన్ యోజన ద్వారా 32 కోట్లకు పైగా మహిళలకు బ్యాంకు ఖాతాలను తెరిచామని పేర్కొన్నారు. "ముద్రా యోజన కింద మంజూరైన రుణాల్లో 60 శాతానికి పైగా మహిళలే పొందారు. నేడు మన ఆడబిడ్డలు సరికొత్త వ్యాపారాల్లో సత్తాచాటుతూ, ప్రత్యేక గుర్తింపును పొందుతున్నారు" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. మహిళల నేతృత్వంలో అంకుర సంస్థల విప్లవాన్ని వివరిస్తూ... దేశంలో నమోదైన 45 శాతానికి పైగా అంకుర సంస్థల్లో కనీసం ఒక మహిళ డైరెక్టరుగా ఉన్నారని ప్రధానమంత్రి తెలిపారు.

# మద్యం మత్తులో డ్రైవ్ చేసి ప్రాణాలతో చెలగాటం ఆడవద్దు..

**-హెల్మెట్ భారం కాదు.. రక్షణ కవచం**
**-బాధ్యతగా డ్రైవ్ చేయండి సురక్షితంగా గమ్యాన్ని చేరండి**
**-ఎస్సై ముత్యం రాజేందర్**



నల్గొండ, ఏప్రిల్ 14: 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా రెండవ రోజు రాయపర్తి మండల కేంద్రంలో ఎస్సై ముత్యం రాజేందర్ ఆధ్వర్యంలో "అరైవ్ - అలైవ్ " నినాదంతో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మొదటగా మండల కేంద్రంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకలలో, ముఖ్యఅతిథిగా ఎస్సై ముత్యం రాజేందర్ పాల్గొని విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై ముత్యం రాజేందర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రాణాలతో చెలగాటమాడుతూ కుటుంబ సభ్యులకు దుఃఖాన్ని మిగుల్చుతున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ను భారంగా కాకుండా బాధ్యతగా ధరించడం వలన మన ప్రాణాలకు రక్షణ కవచంగా ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీటు బెల్టు ధరించి, ట్రాఫిక్ రూల్స్, రోడ్ సేఫ్టీ ప్రమాణాలు పాటించి బాధ్యతగా డ్రైవ్ చేసి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక యువతచే ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహావిష్కరణ అదృష్టం : మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

అమరావతి, ఏప్రిల్ 14: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నానని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చండూరు మండల పరిధిలోని బోడంగిపర్తి గ్రామం లో మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. అంబేద్కర్ స్ఫూర్తితో ఆయన అడుగుజాడల్లో నడిచి కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలిపారు. అంబేద్కర్ స్ఫూర్తితో కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికి తాగునీరు, కరెంట్ నిరంతరాయంగా వచ్చేవని కానీ ఇప్పుడు స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పర్యవేక్షణ లోపం వల్ల చాలా ఇండ్లకు కృష్ణా జలాలు రావడం లేదన్నారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలన్నారు. రైతులు వరి ధాన్యం కోసిన తర్వాత ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలో ప్రజలకు అన్ని కష్టాలే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కలెక్టర్ తో గాని సంబంధిత మంత్రులతో గాని మాట్లాడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్లు గీత ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, చండూరు మాజీ జడ్పిటిసి కర్నాటి వెంకటేశం, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

